



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**మంత్రి ఫరూక్ సతీమణి మృతి.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సంతాపం**

4

## వెంకన్న ఆలయాల నిర్మాణాలకు

# ప్రత్యేక ట్రస్ట్



- మాధవసేవ పేరిట శ్రీకారం
- ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం
- అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖ రాస్తాం
- తిరుపతిలో ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హెూటల్స్‌కు భూ కేటాయింపులు రద్దు
- 24 క్లైమోర్‌మైన్స్ పేలినా బతికున్నానంటే వేంకటేశ్వరస్వామి దయతోనే
- తిరుమలలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న సీఎం
- అనంతరం భక్తులకు అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదం వడ్డించిన సీఎం, కుటుంబ సభ్యులు

2



## తిరుమలలో నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు..

### శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు కుటుంబం

- స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందిన నారా కుటుంబం
- అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షల విరాళం
- అన్నప్రసాద సముదాయంలో భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించిన సీఎం కుటుంబ సభ్యులు


3




## ఆధునిక టెక్నాలజీతో ప్రజల ఆరోగ్య సంరక్షణ

**- సీఎం చంద్రబాబుతో ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి భేటీ**

అమరావతి (చైతన్యరథం): ఏఐ, మెడ్‌టెక్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో వైద్య చికిత్సలను ప్రజలకు మరింత చేరువ చేసే విషయమై ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డితో లోతైన చర్చ జరిపినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, ఏఐ మెడ్‌టెక్ అలయన్స్ (ఏఐఎం) ఫౌండేషన్ ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. దీనిపై ఎక్స్ వేదికగా సీఎం స్పందించారు. టెక్నాలజీలో వచ్చిన కొత్త మార్పులు, ఆవిష్కరణల సమర్ధ వినియోగంతో ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సంరక్షణ విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై తాము విస్తృతంగా చర్చించామని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో వైద్యసేవలను మరింత మెరుగుపర్చేందుకు ఏపీ ప్రభుత్వం, ఏఐఎం ఫౌండేషన్ కలిసి పనిచేసే విషయం కూడా చర్చకు వచ్చిందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఐజీ ఆస్పత్రుల డైరెక్టర్, ఏఐఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాకేష్ కూడా మంచి సలహాలు ఇచ్చారని సీఎం చంద్రబాబు తెలిపారు.





## మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

**- ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.600 కోట్లు చెల్లింపు**

**- త్వరలోనే మరో రూ.400 కోట్లు ఇస్తామని హామీ**



అమరావతి (చైతన్యరథం): విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం, విద్యార్థులకు అండగా నిలిచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇంజనీరింగ్ కాలేజీలకు రూ.600 కోట్లను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. మరో రూ.400 కోట్లు అతి త్వరలో విడుదల చేస్తామని తెలిపింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటికే మొదటి విడతలో రూ.788 కోట్లు చెల్లించగా, రెండవ విడతగా రూ.600 కోట్లు చెల్లించింది. ఎన్ని ఆర్థిక కష్టాలు ఉన్నా, గత ప్రభుత్వం పెట్టి వెళ్ళిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడతల వారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చిన మంత్రి లోకేష్, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, రూ.1388 కోట్లు విడుదల చేసారు. త్వరలోనే మరో విడతలో రూ.400 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది. గత ప్రభుత్వం పెట్టి వెళ్ళిన బకాయిలన్నీ దశలవారీగా చెల్లిస్తామని విద్యాసంస్థలకు ప్రభుత్వం ఇంతకు ముందే తెలిపింది. ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తేవద్దని, ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేసింది.

**మూడు దశాబ్దాల మాదిగ జాతి స్వప్నం చంద్రన్నతో సాకారం**

- మీడియాతో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ

5

**ఆయకట్టులో చివరి ఎకరానికీ నీరందాలి**

- అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశాలు

6

**నాలుగు నెలల్లో విశాఖ మాస్టర్ ప్లాన్**

- పురపాలక మంత్రి నారాయణ వెల్లడి

**నేరాల నియంత్రణలో టెక్నాలజీ కీలకం**

- శాంతిభద్రతల పరిరక్షణలో రాజీవద్దు
- డీజీపీ కార్యాలయంలో సమీక్షలో హెూంమంత్రి అనిత

4

చైతన్యరథం

# వెంకన్న ఆలయాల నిర్మాణాలకు ప్రత్యేక ట్రస్ట్

- మాధవసేవ పేరిట శ్రీకారం
- ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం
- అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖ రాస్తాం
- తిరుపతిలో ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హెూటల్స్‌కు భూ కేటాయింపులు రద్దు
- 24 క్లైమోర్‌మైన్స్ పేలినా బతికున్నానంటే వేంకటేశ్వరస్వామి భిక్షతోనే
- తిరుమలలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న సీఎం
- అనంతరం భక్తులకు అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదం వడ్డించిన సీఎం, కుటుంబ సభ్యులు



తిరుమల (చైతన్యరథం): శ్రీవేంకటేశ్వరుడి ఆలయాల నిర్మాణం కోసం ప్రత్యేకంగా ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తన మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం తిరుమల వేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. అనంతరం వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో భక్తులకు అన్నప్రసాదం స్వయంగా వడ్డించారు. తరువాత మీడియాతో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు లేవు. ఆయా గ్రామాల్లో వెంకన్న ఆలయాల నిర్మాణాల కోసం నిధులు సేకరించేందుకు ట్రస్టు ఏర్పాటు చేస్తాం. నాడు ఎన్టీఆర్ అన్నదానం, నేను ప్రాణదానం కార్యక్రమాలు ప్రవేశపెట్టాం. మూడవ కార్యక్రమంగా మాధవ సేవ పేరిట ఆలయాల నిర్మాణాలను తలపెడుతున్నాం. మాధవసేవ కోసమే ఆలయాల నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. ట్రస్ట్‌కు వచ్చే నిధులు పగడ్బందీగా ఖర్చు చేస్తాం. వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జా చేసినా వాటిని తిరిగి దేవుడికే చెందేలా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## వేంకటేశ్వరుడి ప్రాణభిక్షతోనే బతికున్నా

దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నాం. దేవాన్ష్ ప్రతి పుట్టిన రోజు నాడు తిరుమలలో అన్నదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నాం. తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. ఇప్పటికి విరాళాలద్వారా రూ.2,200 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటైంది. అన్నదానం ఒక మహత్తర కార్యక్రమం. ఇది శాశ్వతంగా జరుగుతుంది. నేను ప్రాణదానం కార్యక్రమం ప్రారంభించా. మానవ సేవ, మాధవ సేవ రెండూ ఉంటాయని ప్రాణదానం తీసుకొచ్చాం. ఏడు కొండలు వేంకటేశ్వరస్వామి సొం తం. వీటిని అపవిత్రం చేయడం తగదు. వ్యాపారాలు జరగకూడదు.గతంలో అసెంబ్లీలో ఏడుకొండలు కాదు 5కొండలు అని వ్యాఖ్యానించినప్పుడు పోరాడాం. ప్రాణ దానం కార్యక్రమం ప్రారంభించి కిందకు వస్తున్న సమయంలో నాపై 24 క్లైమోర్‌మైన్స్ పేల్చారు. అన్ని క్లైమోర్స్ పేల్చినప్పుడు నేను ప్రాణాలతో బతికేవాడిని కాదు..సాక్షాత్తు వేంకటేశ్వరస్వామే నాకు ప్రాణభిక్ష పెట్టారు. ఇందులో వేంకటేశ్వరస్వామి మహిమ ఏంటో ఆలోచించుకోవాలి. 24 క్లైమోర్‌మైన్స్ పేలితే ప్రాణాలతో తప్పించుకోలేరు. వేంకటేశ్వరస్వామి మహిమ వల్లే తాను బతికానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## 3 సంస్థలకు భూ కేటాయింపులు రద్దు

గత ఐదేళ్లలో తిరుమల పవిత్రత కోసం చాలా పోరాటాలు చేశాం. అందుకే అధికారంలోకి వచ్చాక వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచే ప్రక్షాళన చేపడతామని చెప్పి చేశాం. కొండకు ఆనుకుని ముంతాజ్, ఎమర్, దేవాలోక్ సంస్థలకు హెూటళ్ల నిర్మాణానికి 35.32 ఎకరాల భూ కేటాయింపులు రద్దు చేస్తున్నాం. ఏడు కొండలను ఆనుకుని ఎవరూ వ్యాపారం చేయడం, అపవిత్రం చేయడానికి వీళ్లేదు. టీటీడీలో పని చేసే ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం... వేంకటేశ్వరస్వామి పవిత్రను కాపాడటానికి ఒకడుగు ముందుకేయాలి గానీ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరించ వద్దు. దేశం, ప్రపంచంలో ఎక్కడున్నా వేంకటేశ్వరస్వామి ఆస్తులను కాపాడటానికి కంకణం కట్టుకున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## టీటీడీలో హిందువులే పనిచేయాలి

టీటీడీలో పని చేసేవారు హిందువులై ఉండాలి. ఇతర మతస్తులకు గౌరవ ప్రదంగా మరోచోట అవకాశం కల్పిస్తాం. క్రిస్టియన్, ముస్లిం ఆలయాల్లో కూడా ఇతర మతస్తుల ఉండరు. ఏ మతానికి సంబంధించిన ఆలయాల్లో ఆ మతం వారే ఉంటారు. దేశంలోని అన్ని రాజధానుల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించాలని సంకల్పించాం. దీనికోసం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాస్తాం. ప్రపంచ దేశాల్లో హిందువుల ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.











చైతన్యరథం

# తిరుమలలో నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు..

## శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు కుటుంబం






- స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందిన నారా కుటుంబం
- అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షల విరాళం
- అన్నప్రసాద సముదాయంలో భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించిన సీఎం కుటుంబ సభ్యులు








తిరుమల (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. మనవడు నారా దేవాన్ష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం నారా చంద్రబాబు కుటుంబం శుక్రవారం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు నారా దేవాన్ష్ శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు పొందారు. దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ముఖ్యమంత్రి ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఇతర కుటుంబ సభ్యులకు మహాద్వారం వద్ద ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద మొక్కుకున్న అనంతరం కుటుంబ సమేతంగా శ్రీవారిని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రికి అర్చకులు స్వామివారి శేష వస్త్రాన్ని అందించారు. తరువాత రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులకు శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, విశ్వావసు నామ సంవత్సర పంచాంగం, డైరీ, క్యాలెండర్, అగరబత్తులు, పంచగవ్య ఉత్పత్తులను చైర్మన్, ఈవోలు అందించారు.

స్వామివారి దర్శనం అనంతరం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్... భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా భక్తులతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయంటూ భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం భక్తులతో కలిసి ఆయన ప్రసాదం స్వీకరించారు. ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షలను చంద్రబాబునాయుడి కుటుంబం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చింది. ఏటా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా నారా కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుని అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ ఈవో జె.శ్యామల రావు, అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, పనబాక లక్ష్మి, ఎం.శాంతారామ్, నన్నూరి.నర్సిరెడ్డి, జీ. భాను ప్రకాష్‌రెడ్డి, ఎస్. నరేష్‌కుమార్, పి.రామమూర్తి, సౌరభ్ హెచ్.బోరా, టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





చైతన్యరథం

## కూటమి పాలనలో అభివృద్ధి-సంక్షేమం

# పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం.. గడిచిన 9 నెలల్లో సాధించిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మన్నవ శారదా దేవి రచించిన “కూటమి పాలనలో అభివృద్ధి-సంక్షేమం” పుస్తకాన్ని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు ప్రభుత్వం ముందున్న సవాళ్లను తెలియజేసేలా పుస్తకం ఉందని శారదాదేవిని సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో మందడి వెంకట్రామయ్య, మందడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం, విద్య, వైద్యానికే మొదటి ప్రాధాన్యత



- మంత్రి డోలా స్పష్టీకరణ
- తూర్పునాయుడుపాలెంలో 85 మందికి రూ.73లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కొండపి(చైతన్యరథం):పేదల ఆరోగ్యం, విద్య,వైద్యానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గ పరిధిలోని 85మందికి శుక్రవారం తూర్పు నాయుడుపాలెంలోని తన నివాసంలో రూ.73,35,558 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు తన నియోజకవర్గంలో 218 మందికి రూ.2,12,05,140 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి వచ్చిన ప్రతిఆర్జీకి న్యాయం చేస్తున్నామన్నారు.

ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఆరోగ్య బీమా కల్పించడంతోపాటు ఎన్టీఆర్ వైద్య భరోసా ద్వారా 25లక్షల రూపాయల వరకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు, ప్రతి కుటుంబం సాధికారత సాధించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. స్వంత గృహాలు నిర్మించుకునేందుకు ఎస్సీ,బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీ చెంచులకు లక్ష రూపాయల చొప్పున అదనపు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు చెప్పారు.

# నేరాల నియంత్రణలో టెక్నాలజీ కీలకం




- శాంతిభద్రతల పరిరక్షణలో రాజీవద్దు
- చిన్నారులు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం
- ప్రతి 3 నెలలకోసారి శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమీక్ష
- పటిష్ట భద్రతతో శాసనసభ సమావేశాల నిర్వహణ అభినందనీయం
- కలెక్టర్ల సదస్సును కూడా సమర్థవంతంగా నిర్వహిద్దాం
- ‘హెల్మెట్’ ధరించని వారిపట్ల సున్నితంగా వ్యవహరించాలి
- డీజీపీ కార్యాలయంలో సమీక్షలో హోంమంత్రి అనిత

అమరావతి (చైతన్యరథం): నేరాల నియంత్రణలో టెక్నాలజీ పాత్ర చాలా కీలకమని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడే విషయంలో రాజీపడవద్దని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. చిన్నారులు, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. నేరం జరగ్గానే నిందితులను పట్టుకోవడం మంచి పరిణామమని పోలీసు యంత్రాంగం పనితీరును మెచ్చుకున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ల వంటి టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకుంటే నేరాలను మరింత తగ్గించవచ్చన్నారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో హోంమంత్రి అనిత శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి 3 నెలలకోసారి శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పటిష్ట భద్రతతో శాసనసభ సమావేశాల నిర్వహణకు కృషి చేసిన పోలీసులందరినీ హోంమంత్రి అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 25,26 తేదీల్లో జరగనున్న కలెక్టర్ల సదస్సుకు కూడా సమర్థవంతంగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

కెమెరాల ఏర్పాటులో పురోగతిపై జిల్లాల ఎస్పీలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ఇప్పటికే సుమారు 24వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కర్నూలు రేంజ్ డీఐజీ తెలిపారు. జిల్లాల వారీగా డీజీపీ హరీష్ గుప్తా ఇచ్చినలక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేస్తున్నట్లు హోంమంత్రికి ఎస్పీలు వివరించారు. ‘హెల్మెట్’ ధరించని వారి పట్ల సున్నితంగా ముందుకెళ్లాలని నగర కమిషనర్లకు హోంమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైనచోట కఠినంగా ఉంటూనే కొన్నిచోట్ల పట్టువిడుపుతో వ్యవహరించాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా పోలీసులు నిర్వహిస్తున్న హెల్మెట్ డ్రైవ్‌ను హోంమంత్రి ప్రశంసించారు. రెవెన్యూపరమైన కేసులను మరింత వేగంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ బాధ్యత నిర్వహించాలన్నారు. అందుకోసం రెవెన్యూ శాఖతో నిరంతరం పోలీస్‌శాఖ సమన్వయం చేసుకోవాలన్నారు. న్యాయపరమైన చిక్కుముడులున్న కేసులపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో రౌడీయిజం, పబ్లిక్ న్యూసెన్స్ కేసులపైనా హోంమంత్రి ఆరా తీశారు. వాటిని నియంత్రించేందుకు పాత రౌడీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని హోంమంత్రి ఆదేశించారు. కాగా హోంమంత్రి అనితను రాష్ట్ర పోలీస్ సంఘం ప్రతినిధులు కలిశారు. పోలీసులకు రావలసిన సరెండర్ లీవుల బకాయిలు ఇప్పించాలని కోరుతూ వారు వినతిపత్రం అందజేశారు.

సమీక్షకు డీజీపీ హరీష్ గుప్తాతో పాటు ఐజీ,డీఐజీ స్థాయి పోలీస్ ఉన్నతాధికారులు, విజయవాడ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్లు,అన్ని జిల్లాల ఎస్పీలు, డీజీపీ కార్యాలయంలోని పోలీస్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

సమీక్ష సమావేశం ముగించుకుని క్యాంపు కార్యాలయానికి బయలుదేరిన హోంమంత్రి అనితని కొంతమంది హిజ్రాలు కలిశారు. ఇటీవల అనకాపల్లి హిజ్రా హత్య కేసులో ప్రభుత్వం, పోలీసుల స్పందనను మెచ్చుకుంటూ వారు ప్రత్యేకంగా హోంమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఓ హిజ్రాకు సంబంధించిన పోస్టింగ్ గురించి హోంమంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఎన్జీవో, వన్ స్టాప్ సెంటర్లలో గతంలో ఉద్యోగాలుండేవని ప్రస్తావించారు. చదువుకున్న అర్హతలను బట్టి గౌరవప్రదంగా ఉద్యోగం చేసి బతకాలనుకునే హిజ్రాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని హోంమంత్రిని కోరారు.

## మంత్రి ఫరూక్ సతీమణి మృతి..

# సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సంతాపం

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు భార్యా వియోగం కలిగింది. ఆయన భార్య షహనాజ్ హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశారు. ఆమె మృతి పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, తదితరులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

### సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అర్ధాంగి షహనాజ్ మరణించారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని సీఎం చంద్రబాబు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

ఆమె మృతితో విషాదంలో ఉన్న ఫరూక్ కుటుంబానికి ముఖ్యమంత్రి సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని అల్లాను ప్రార్థిస్తున్నానని, ఈ కష్ట సమయంలో గుండె నిబ్బరంతో ఉండాలని మంత్రి ఫరూక్‌ను కోరుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.

### ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి: మంత్రి లోకేష్

మంత్రి ఎన్ఎండి ఫరూక్ సతీమణి షహనాజ్ మృతి పట్ల విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సంతాపం తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ఆమె ఇంతి ఖాల్ అయ్యారు. ఆమెకు జన్నత్‌లో ఉన్నతమైన స్థానం ప్రసాదించాలని, ఆత్మకు శాంతి కలగాలని అల్లాని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానన్నారు.

### మంత్రి ఆనం సంతాపం

నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ సతీమణి షహనాజ్ అకాల మరణ వార్త పట్ల దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆమె మరణంపట్ల విచారం వ్యక్తం చేశారు. మంత్రి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులు ఈ క్లిష్ట పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలని ఆకాంక్షించారు.

### ఫోన్‌లో మంత్రి డోలా పరామర్శ

మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి మృతి పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంతాపం తెలిపారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న మంత్రి డోలా వెంటనే మంత్రి ఫరూక్‌ను ఫోన్లో పరామర్శించారు. ఆమె మృతి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ అల్లా వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని మంత్రి డోలా ప్రార్థించారు.



### ఫరూక్‌కు మంత్రి జనార్థన్ రెడ్డి పరామర్శ

మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ సతీమణి షహనాజ్ అకాల మృతిపట్ల రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. ఈవిషాద వార్తతెలిసిన వెంటనే ఫోన్‌లో మంత్రి ఫరూఖ్‌ను బీసీ జనార్ధన్‌రెడ్డి పరామర్శించారు. నంద్యాలజిల్లాలో తన సహచర మంత్రి, తనకు అత్యంత ఆప్తులైన ఫరూఖ్ సతీమణి షహనాజ్ మృతి అత్యంత బాధాకరం అన్నారు. ఫరూఖ్ కుటుంబ సభ్యులకు తనప్రగాడ సంతాపం తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ఇవ్వాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు.

### మంత్రి కొల్లు రవీంద్ర సంతాపం

మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ మృతి పట్ల గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు అల్లా చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. వారి కుటుంబసభ్యులకు ఆ అల్లా మనోధైర్యం కల్పించాలి. ఫరూఖ్ గుండె నిబ్బరంతో ఉండాలని ఆకాంక్షించారు.

### మంత్రి నాదెండ్ల విచారం

మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ అకాల మరణం పట్ల పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబం ఈ తీవ్రవిషాదాన్ని తట్టుకుని కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నర్సింగ్ విద్యా రంగంలో సంస్కరణలకు శ్రీకారం

- నిబంధనలు ఉల్లంఘించి 133 సంస్థలకు గత ప్రభుత్వం అనుమతి
- ఇక ఆయా ప్రాంతాల అవసరాల మేరకే నర్సింగ్ కాలేజీలకు అనుమతులు
- మౌలిక వసతులు, విద్యా నాణ్యత లోపాలపై కఠిన చర్యలు
- నర్సింగ్ విద్యా సంస్థల్లో లోపాలపై యాజమాన్యాలకు నోటీసులు
- జూన్ 15లోగా సవరించుకోకుంటే ప్రవేశాలకు నిరాకరణ
- అధికారులకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలు
- మూడు గంటల పాటు వివిధ అంశాలు, సమస్యలపై మంత్రి సమీక్ష

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన నర్సింగ్ విద్యా సంస్థలు, తదనంతర పరిణామాలపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రక్షాళన చేయడానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు ఉన్నతమైన వైద్య సేవల్ని అందించడానికి డాక్టర్లతో పాటు అంతే ప్రధానమైన ఉన్నత ప్రమాణాలు కలిగిన నర్సుల్ని అందించే దిశగా పలు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ కీలక రంగానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులతో వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో శుక్రవారంనాడు దాదాపు మూడు గంటలపాటు సమీక్షించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

పలు సంవత్సరాలుగా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు స్వీయ ప్రతిపాదనలతో ముందుకొచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేయడంతో...రాష్ట్ర వ్యాప్తంగా 571 నర్సింగ్ స్కూళ్లు, కాలేజీలు ఏర్పాటయ్యాయి. ఇందులో 21 ప్రభుత్వ సంస్థలు కాగా 550 ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. ఈ సంస్థల నుండి ఏడాదికి 30,220 మంది నర్సులు ఉత్తీర్ణులవుతున్నారు. ఈ నేపథ్యంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, వాటిలో నర్సింగ్ విద్య నాణ్యతపై వివిధ అంశాల్ని సమగ్రంగా పరిశీలించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కొంత కాలం కిందట అధికారులను ఆదేశించారు. పరిశీలనలో వెల్లడయిన పలు అంశాలపై అధికారులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

## అవసరం మేరకే అనుమతులు

రాష్ట్ర అవసరాలతో నిమిత్తం లేకుండా పలు నర్సింగ్ విద్యా సంస్థలు ఏర్పాటైన నేపథ్యం, దాని పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని గుర్తించిన అవసరాల మేరకు మాత్రమే అలాంటి విద్యాసంస్థల ఏర్పాటును ప్రోత్సహించాలని ఈ సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. గతంలో మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లాల వారీగా డిమాండ్, సరఫరా పరిస్థితిని డీఎంఈ అధికారులు మదింపు చేశారు. జనాభా ఆధారంగా ప్రతి వెయ్యి మందికి ముగ్గురు నర్సులు, రెండు ఆసుపత్రి పడకలు ఉండాలన్న డబ్ల్యుహెచ్ఓ ప్రమాణాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ మదింపు చేశారు. దీని ఆధారంగా అవసరాల కంటే బాగా తక్కువగా నర్సుల లభ్యత ఉన్న 8 జిల్లాల్లో నూతన నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించారు. నర్సుల కొరత ఎక్కువగా ఉన్న జిల్లాలుగా...శ్రీసత్యసాయి, నంద్యాల, ఏలూరు, కోనసీమ, అన్నమయ్య, శ్రీకాకుళం, బాపట్ల, అల్లూరు సీతారామరాజు జిల్లాల్ని ఆ క్రమంలో గుర్తించారు. అవసరాల కంటే ఎక్కువగా నర్సుల లభ్యత ఉన్న జిల్లాలు...విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, తూర్పుగోదావరి, నెల్లూరు, కడప, ప్రకాశం, అనంతపురంగా గుర్తించారు.



రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు క్రమాన్ని పరిశీలించగా... 2019-24 కాలంలో 133 విద్యా సంస్థల (మొత్తంలో దాదాపు నాలుగో వంతు) ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం అనుమతించినట్లు వెల్లడయ్యింది. వీటి ద్వారా ఏడాదికి 6,460 మంది నర్సులు (మొత్తంలో 22 శాతం) ఉత్తీర్ణులవుతున్నారు. ఇదే కాలంలో 28 విద్యా సంస్థలకు నియమాలకు విరుద్ధంగా పేరెంట్ ఆసుపత్రులు లేకపోయినా అనుమతులు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు.

ప్రైవేట్ రంగంలోని 548 నర్సింగ్ విద్యా సంస్థలకు సంబంధించి అధికారులు చేపట్టిన డాక్యుమెంట్ల పరిశీలన ఫలితాల్ని మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు. వీటిలో 427 సంస్థలు (78 శాతం) నియమాల ప్రకారం ఉండాల్సిన పేరెంట్ ఆసుపత్రుల వివరాల్ని ప్రభుత్వానికి అందించలేదు. 357 సంస్థలు (65 శాతం) స్వంత భవనాలకు సంబంధించి, 148 సంస్థలు(27 శాతం) మేనేజ్‌మెంట్ ట్రస్టు/ సొసైటీకి చెందిన వివరాల్ని అందించలేదు.

## లోపాలపై ఏప్రిల్ 15లోగా నోటీసులు

డాక్యుమెంట్ల పరిశీలనలో బయటపడిన లోపాలు, వాటి పరిణామాలపై అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ కూలంకషంగా చర్చించారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ విద్యా సంస్థల్లో అందిస్తున్న విద్య నాణ్యతపై మంత్రి పలు ప్రశ్నల్ని సంధించి, పర్యవేక్షణ లోపాన్ని ఎత్తి చూపారు. ఆయా నర్సింగ్ విద్యా సంస్థల్లో నియమాల మేరకు అధ్యాపకుల నియామకం, సొంత భవనాల లభ్యత, ప్రయోగశాలల ఏర్పాటు, క్లినికల్ మెటీరియల్‌ల లభ్యతపై ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు జరపాలని మంత్రి ఆదేశించారు. డీఎంఈ విభాగం గుర్తించిన లోపాలపై ఏప్రిల్ 15లోగా ఆయా నర్సింగ్ విద్యా సంస్థలకు నోటీసులిచ్చి వాటిని రెండు నెలల్లోగా సవరించుకోకుంటే 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల్ని అనుమతించేది లేదంటూ స్పష్టం చేయాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. అదేవిధంగా వివిధ నర్సింగ్ విద్యా సంస్థల్లో భౌతిక పరిశీలనలో వెల్లడయ్యే లోపాల్ని ఈ ఏడాది జూన్ 15లోగా సవరించకపోతే ప్రవేశాల్ని అనుమతించరాదని మంత్రి ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి డాక్టర్ మంజుల డి. హొస్మణి, డీఎంఈ డాక్టర్ నరసింహం, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ కార్యదర్శి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల.. మాదిగ జాతి స్వప్నం చంద్రన్నతో సాకారం

- సమాజ శ్రేయస్సులో సమానత్వమే లక్ష్యంగా చంద్రబాబు అడుగులు
- ప్రజలకు సమానంగా ఫలాలను అందించడంలో మరో అంబేద్కర్ మన చంద్రబాబు
- వెనుకబడిన మాదిగల అభివృద్ధి కోసం వర్గీకరణను మాలలు గౌరవించి ఆమోదించడం హర్షణీయం
- మీడియాతో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ

అమరావతి (చైతన్యరథం): మాదిగల ముప్పయ్యేళ్ల కలను సాకారం చేస్తూ ఎస్సీ వర్గీకరణ నేడు ఆచరణలోకి వస్తోందంటే అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించిన చొరవ, నిబద్ధతే కారణమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలోని వర్ల రామయ్య నివాసంలో శుక్రవారం మీడియాతో వారు మాట్లాడారు.

తొలుత వర్ల రామయ్య మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన మాదిగల ఉన్నతి కోసం ముప్పై ఏళ్ల కిందట ఉద్యమించి నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి మందకృష్ణ మాదిగ అన్నారు. ఆనాటి ఆయన కల నేడు నెరవేరుతోంది. ఎస్సీలంటే పలానా అని చెప్పు కోలేని స్థితి నుండి నేను మాదిగ అని సగర్వంగా చెప్పుకునేలా మందకృష్ణ మాదిగ పోరాడారు. ఎస్సీల ఉన్నతి కోసం.. వారి శ్రేయస్సుకోసం.. అభివృద్ధి ఫలాలు వారికి సమానంగా అందించడం కోసం మొదటి నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. సమాజంలో సంక్షేమ ఫలాలు అందరికి సమానంగా అందించడమే లక్ష్యం గా ఆయన పనిచేస్తున్నారు. అందులో భాగంగా నాడు ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు ఆమోద ముద్ర వేసింది చంద్రబాబే. కోర్టు తీర్పుల నేపథ్యంలో కొంత కాలం ఎస్సీ వర్గీకరణ నిలిచిపోయినా, గత ఏడాది సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అంగీకారం తెలిపింది. నేడు మళ్లీ చంద్రబాబు పాలనలోనే మాదిగలకు పూర్తి న్యాయం జరుగుతోంది. వెనుకబడిన మాదిగలు సమాజంలో సమాన అభివృద్ధి సాధించాలని శాసనసభలో స్వయంగా మాల నాయకులు తీర్మానం చేసి..ఎస్సీల వృద్ధిని కాంక్షించడం ఎంతో హర్షించాల్సిన విషయం. ప్రజాస్వామ్యంలో మారుతున్న కాలానుగుణంగా ప్రజలందరూ సమాన హక్కులు పొందుతారు. అన్ని వర్గాలు, అన్ని కులాలు సమానత్వంతో బతుకుతారు. ఇది విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుకు ముందే తెలుసు కాబట్టే నాడే వర్గీకరణను ఆయన అమలు చేశారు. సమానత్వం కోసం చంద్రబాబు కన్న కలలు.. వ్యక్తుల, సమాజ అభివృద్ధికి ఆయన విజన్ ప్రజలందరికీ ఆదర్శం.. వెనుకబడిన మాదిగ జాతి చైతన్యవంతులై.. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యావంతులై అందరికీ ఆదర్శంగా అన్ని రంగాల్లో రాణించాలి. మాదిగల కోసం చంద్రబాబు చేసిన మేలును గుర్తించి ఎల్లప్పుడూ మంచి ప్రభుత్వానికి అండగా ఉండాలి. విభేదాలు లేకుండా వ్యక్తి వికాసం కోసం, సమాజ వికాసం కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలి. మాదిగజాతి మానవ జాతికి మేలు చేసేదిగా ఉండి.. ప్రతి ఒక్కరికి ఆదర్శంగా మారాలి. సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా.. వారి ఉన్నతికి ప్రతి ఒక్కరు తోడ్పడాలి. మాదిగ జాతి అన్ని వర్గాలకు, అన్ని కులాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నానని వర్ల ఆకాంక్షించారు.



## ఇచ్చిన మాటకు కట్టుబడ్డ చంద్రబాబు: కృష్ణ మాదిగ

మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మూడు దశాబ్దాలుగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని కొనియాడారు. ఎన్ని అడ్డంకులు, అవాంతరాలు, ఒత్తిడులు వచ్చినా, న్యాయం కోసం నిలబడిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేశారని చెప్పారు. 1997-98లోనే తొలిసారి తీర్మానం ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఇచ్చిన మాట కోసం చంద్రబాబు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా న్యాయం వైపే నిలబడ్డారన్నారు. నేడు ఎస్సీ వర్గీకరణ సాకారం అవుతోందంటే సీఎం చంద్రబాబుదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. దీన్ని చారిత్రక విజయంగా భావిస్తున్నామని తెలిపారు. 30 ఏళ్ల పోరాటంలో అమరులైన వారికి ఈ విజయం అంకితం ఇస్తున్నామని చెప్పారు. తమ ఉద్యమంలో న్యాయం ఉందనే దానికి అందరి మద్దతే నిదర్శనం అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తమకు అండగా నిలిచారని మంద కృష్ణ మాదిగ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల ఉద్యమానికి జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా మద్దతు ఇచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం ద్వారా చంద్రబాబు సామాజిక న్యాయం చేశారని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణపై వైసీపీ ఇప్పటికీ తమ అభిప్రాయాన్ని చెప్పలేదని అన్నారు. గతంలో కనీసం వినతిపత్రం ఇచ్చేందుకు కూడా జగన్ తమకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. జగన్ ఉండి ఉంటే ఎస్సీ వర్గీకరణను ఇక చూసేవాళ్లమే కాదని మంద కృష్ణ వ్యాఖ్యానించారు.

చైతన్యరథం

# నాలుగు నెలల్లో విశాఖ మాస్టర్ ప్లాన్

- గత పాలకుల స్వార్థ ప్రయోజనాల కోసమే మాస్టర్ ప్లాన్ తయారీ
- మార్పులు చేసి ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచుతాం
- ప్రజల సూచనలు స్వీకరించి తుది మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తాం
- పురపాలక మంత్రి నారాయణ వెల్లడి
- విశాఖ ఎమ్మెల్యేలతో నగర అభివృద్ధిపై సమీక్ష



అమరావతి (చైతన్యరథం): విశాఖ అభివృద్ధికి సంబంధించి నాలుగు నెలల్లోగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ తెలిపారు. రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని వైజాగ్ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో స్వార్థ ప్రయోజనాల కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించారని, దానిలో మళ్లీ మార్పులు చేసి ప్రజాభిప్రాయంతో ఫైనల్ ప్లాన్ విడుదల చేస్తామని తెలిపారు. విశాఖపట్నం నగర అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో మంత్రి నారాయణ సమీక్ష జరిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్, వంశీ కృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు,ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ గోపాల్, రెవిన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథ్, ఇతర అధికారులు హాజరయ్యారు. వైజాగ్ లో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యలు, మెట్రో రైల్ ప్రాజెక్ట్, భూముల ఆక్రమణ, తాగునీటి సమస్య, టీడీఆర్ బాండ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి వంటి అంశాలను సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణతో పాటు పలువురు ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు.

## ప్రజల అభిప్రాయాలు తీసుకుంటాం

గతంలో అప్పటి పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసం విశాఖ మాస్టర్ ప్లాన్ రూపొందించారని మంత్రి నారాయణ తప్పుబట్టారు. అందులో మార్పులు చేసి మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతాం. ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుని నాలుగు నెలల్లో మాస్టర్ ప్లాన్ ఫైనల్ చేస్తాం. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలి. కొన్ని చోట్ల రోడ్లు వెడల్పు చేయాల్సి ఉంది. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమే. దీనిపై కూడా సమావేశంలో చర్చించాం. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయి. టీడీఆర్ బాండ్లపైనా సమావేశంలో చర్చించాం. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోంది. అన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయి. భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయి. దీంతో రోడ్ల విస్తరణ చెయ్యాల్సి ఉంది. తాగు నీటిసమస్య కూడా ఉంది. అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. విశాఖ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఆదేశాలతో ముందుకెళుతున్నామని మంత్రి నారాయణ తెతిపారు.

## అన్ని అంశాలూ చర్చించాం: ఎమ్మెల్యే పల్లా

విశాఖ మాస్టర్ ప్లాన్‌పై మంత్రి నారాయణ సమక్షంలో సమీక్ష జరిపామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కొన్ని రోడ్లకు పక్కన చిన్నచిన్న స్థలాలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. వీటికి సంబంధించి ఇబ్బందులు లేకుండా చూడమని మంత్రి నారాయణను కోరాము. అధికారులు మారడం వల్ల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తామని ఎమ్మెల్యే పల్లా తెలిపారు.

## ప్రజల అభిప్రాయం తీసురుంటాం: ఎమ్మెల్యే కొణతాల


విశాఖ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని అనకాపల్లి ఎమ్మెల్యే కోణతాల రామకృష్ణ తెలిపారు. గతంలో ఇష్టానుసారంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారు. ప్రజల అభిప్రాయం తీసుకుని మాస్టర్‌ప్లాన్ మళ్లీ రూపొందించాలని నిర్ణయించాం. నాలుగు నెలల్లో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తాం. 22ఏ భూములు, తాగు నీటి సమస్య, బీచ్ కారిడార్ సమస్యలు ఉన్నాయి. అనకాపల్లి, గాజువాకలో చాలా కాలంగా భూ సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి మంత్రి నారాయణ అంగీకారం తెలిపారని ఎమ్మెల్యే కొణతాల చెప్పారు.

## లొసుగులు సరిచేయాలి: ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

విజన్- 2047పై ఫోకస్ పెట్టినట్టుగానే సీఎం చంద్రబాబు వైజాగ్ అభివృద్ధిపై దృష్టి పెట్టారని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ శాఖా చాలా కీలకం. వైజాగ్ మాస్టర్ ప్లాన్ లో కొన్ని లొసుగులు ఉన్నాయి. ఇవన్నీ సరిచేయాలని మంత్రి నారాయణకు కోరామన్నారు.

---

# ఆయకట్టులో చివరి ఎకరానికీ నీరందాలి



- సాగు నీటి సరఫరాలో ఇబ్బందులు రాకూడదు
- ఇరిగేషన్, రెవిన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలి
- ఎస్ఈ నుండి కింది స్థాయి అధికారుల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలు

అమరావతి(చైతన్యరథం): సాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జల వనరులశాఖ అధికారులను, కలెక్టర్లను మంత్రి నిమ్మల రామా నాయుడు ఆదే శించారు. రబీ సీజన్ మరో పది, పది హేను రోజుల్లో ముగుస్తుండటంతో కాలువల ఆయ కట్టు చివరి రైతులకు సైతం సాగు నీరందించేందుకు నీటి నిర్వహణ సక్రమంగా చేసుకోవాలన్నారు. జల వనరులశాఖ ఈఎన్సీ ఎం.వెంకటేశ్వర రావు, కర్నూలు, ఒంగోలు జిల్లాల సీఈలతో పాటు వారి పరిధిలోని ఎస్ఈలు,ఈఈలతో శుక్రవారం మంత్రి అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు.కేసీకెనాల్ ఆయుకట్టు, నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆయు కట్టు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదా వరి జిల్లాల ఆయుకట్టు పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందించాలని అధికారు లను మంత్రి రామానాయుడు ఆదేశించారు.

నంద్యాల, పల్నాడు, ప్రకాశం, కోన సీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి రామానాయుడు.. సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నా రు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సమన్వ యం చేసుకుంటూ వారాబందీ పగడ్బం దీగా నిర్వహిస్తూ, ఆఖరి ఎకరం వరకు సాగు నీరు అందించాలని స్పష్టం చేశారు. రబీ సీజన్ ముగుస్తుండడంతో ఎస్ఈ స్థాయి అధికారుల నుంచి, ఈఈలు, డీఈఈ లు, ఏఈఈల వరకు క్షేత్ర స్థాయిలో ఉండి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీ పంటకు రానున్న పది, పదిహేను రోజులు ఎంతో కీలకం అని, రైతులకు సాగునీరు అందించే విషయంలో ఎటు వంటి ఇబ్బందీ లేకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. కాలువల్లో పూడికలు, తూడు తొలగింపు, లాకుల మరమ్మత్తులు వంటి సమస్యలను అధిగమించి రైతుల పంటను కాపాడాలని మంత్రి స్పష్టం చేశారు.

---

# ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా

- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉద్ఘాటన
- కోట్లాది రూపాయిల సీఎంఆర్ఎఫ్ నిధులతో పేద ప్రాణాలకు అండ
- నియోజకవర్గ స్థాయిలో సాధికార సారథుల సేవలు భేష్
- 80 మందికి సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



అద్దంకి (చైతన్యరథం): ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇచ్చిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరులో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా 80 మంది లబ్ధిదారులకు రూ.39 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వీటితో పాటు రూ.9 లక్షల విలువైన ఎల్వోసీలను ఇద్దరికి అందజేశారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... అనారోగ్య సమస్యల వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు తల్లకిందులవుతాయని, ఆస్పత్రుల ఖర్చులతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతాయిని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బడుగు, బలహీన, అల్పాదాయ వర్గాల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టామని వివరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వందలాది మందికి ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటి వరకు 439 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి చేకూరిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

## సాధికార సారథులతో పార్టీ మరింత బలోపేతం

తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం దిశగా సాధికార సారథులు కృషి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో సాధికార సారథులు పార్టీ గెలుపుకు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు.

నియోజకవర్గంలో ఎవరికి ఏ అవసరమో వారికి తెలుసని చెప్పారు. పథకాలు అందని వారికి, సీఎంఆర్ఎఫ్ అవసరమైన వారిని సాధికార సారథులే గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న మొత్తం 4,500 మంది సాధికార సారథులతో పార్టీ సభ్యులు కూడా సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. నెలలో ఒక రోజు అందరూ కలిసి సమావేశం అయ్యి అన్ని విషయాలూ చర్చించాలని చెప్పారు. అదే విధంగా సాధికార సారథులను ఎవరూ తక్కువ చేయకూడదని, గత ఎన్నికల్లో వారంతా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించారని గుర్తు చేశారు. ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తే తెలుగుదేశం పార్టీకి ఎదురు ఉండదని ధీమా వ్యక్తం చేశారు.

చైతన్యరథం

# వాగును ఆక్రమించి నీటికి అడ్డుకట్ట

- 200 ఇళ్లకు ముంపు ప్రమాదం
- అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి
- భూ కబ్జాలపై పలువురి ఫిర్యాదులు
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు
- వినతులు స్వీకరించిన రావి వెంకటేశ్వరరావు, శ్యావల దేవదత్





అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యలపై అర్జీదారులు తరలి వచ్చారు. అర్జీదారుల నుంచి రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శ్యావల దేవదత్ వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లా బత్తులపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన అప్పస్వామి, పలువురు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తూ.. నీరు పోయే వాగుకు ఈశ్వరయ్య అనే వ్యక్తి అడ్డుకట్ట కట్టాడని దాంతో నీరు ఊరిమీదకు వచ్చి 200 ఇళ్లకు పైగా ముంపు ప్రమాదం ఉందని.. దయ చేసి ప్రమాదం జరగక ముందే అధికారులు వాగు ఆక్రమణను తొలగించి ముంపు బారినుండి గ్రామస్తులను కాపాడాలని వేడుకున్నారు.

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం ఆమందూరుకు చెందిన కె.వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలోని సర్వే నెంబర్ 134/25 లో ఉన్న 0.98 సెంట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందని.. అధికారులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు.

దళితులమైన తమ భూములకు జి.చంగల్‌రెడ్డి, కృష్ణారెడ్డి అనే వ్యక్తులు దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి కాజేయాలని చూస్తున్నారని.. దీన్ని అడ్డుకునే ప్రయత్నంలో తమపై దాడులు చేస్తున్నారని.. అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన కృపాకర్ అనే వ్యక్తి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

గుంటూరు జిల్లా కొల్లిపర మండలానికి చెందిన ఏడుకొండలు, శివనాగేశ్వరరావు, తదితరులు విజ్ఞప్తి చేస్తూ..తమబిడ్డల విదేశీ చదువులకోసం విదేశీ విద్యా దీవెన అందించి ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యర్థించారు.

ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన ఈనిడ్ జాయ్ విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని అమ్మడానికి నిరాకరించడంతో తన తల్లి సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసపూరితంగా దొంగ రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా పొలంలోకి వెళితే తమను చంపేస్తామని బెదిరిస్తున్న ఎడ్లపల్లి సుబ్బారావు, జూలూరి కృష్ణ, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కలిదిండి గోపాలరాజు, మేడవరపు శ్రీరామచంద్రమూర్తి, జూలూరి రాఘవేంద్రరావులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన మాదల సాంబశివరావు విజ్ఞప్తి చేస్తూ.. గత ఏడాది జూన్ 8వ తేదీన తన ఇంట్లో దొంగతనం జరిగి 30 సవర్ల బంగారం, లక్షా 10 వేలు నగదు పోయాయని.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నేటికీ ఫలితం లేదని.. దయ చేసి దొంగలను పట్టుకొని తమ సొత్తును రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కడప జిల్లా ఒంటిమిట్ట మండలం క్రొత్త మాధవరం గ్రామానికి చెందిన ఆలూరి నరసింహులు అను వ్యక్తి గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. రూ.2 కోట్ల విలువైన స్థలానికి మాజీ సర్పంచ్ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి హోటల్ నిర్మాణం చేపడుతున్నాడని.. దీనిపై విచారించి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

**- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్**

రామచంద్రపురం (చైతన్యరథం): మతసామరస్యానికి, సమాజంలో సమానత్వం, శాంతి కోసం ఇఫ్తార్ విందులు దోహదపడతాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురంలోని చిన్న మసీదు, పెద్ద మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను మంత్రి పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జరిగిన ప్రార్థనలో రాష్ట్రం సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటూ అల్లాను ప్రార్థించారు. ముస్లింలకు రంజాన్ పర్వదినాలు ఎంతో ప్రాముఖ్యమైనవని, ఉపవాస దీక్ష అనేది కేవలం అల్లా అనుగ్రహం కోసమే కాదని, సమాజంలో సోదర భావం, ఐకమత్యం, దయాగుణం, ప్రేమ పెంపొందించేందుకు దోహదపడతాయని మంత్రి సుభాష్ అన్నారు. లోకశాంతి కోసం ముస్లిం సోదరులంతా అల్లాను ప్రార్థనలు చేయాలని కోరారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు

# రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ గరుడ

## - 100 బృందాలతో మందుల షాపులు, ఏజెన్సీలపై దాడులు



అమరావతి (చైతన్యరథం): మత్తును కలిగించే ఔషధాల విక్రయాలపై ఈగల్ విభాగం పోలీసులు నిఘా పెట్టారు. ఔషధాల దుర్వినియోగంపై రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఒకేసారి అధికారులు తనిఖీలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వంద బృందాలతో మెడికల్ షాపులు, ఏజెన్సీల్లో ఐజీ ఈగల్ టీమ్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. ఆపరేషన్ గరుడలో భాగంగా డీజీపీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. సైకోటిక్ మందులను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ హెచ్చరించారు. ఆల్ప్రెండ జోలమ్, ట్రెమడాల్ లాంటి సైకోటిక్ మందులను అనధికారికంగా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఈ దాడులు నిర్వహించారు.

రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నిర్దేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి డ్రగ్స్ దుర్వినియోగంపై మెడికల్ షాపులు, మెడికల్ ఏజెన్సీల పై దాడులు నిర్వహించామని ఈగల్ (ఎలైట్ యాంటీ-నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్) ఐజీ ఆకే రవి కృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, హోం మంత్రి వంగలపూడి అనిత సూచనలకు అనుగుణంగా ఆపరేషన్ గరుడ చేపట్టామన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా నిలపడమే లక్ష్యంగా రాష్ట్ర డిజిపి పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని గుణదలలో మందుల షాపు వద్ద పాత్రికేయులతో ఈగల్ ఐజీ ఆకే రవి కృష్ణ మాట్లాడుతూ ఈ తనిఖీలకు ఆపరేషన్ గరుడ అని పేరు పెట్టామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 100 బృందాల ఆధ్వర్యంలో ఆపరేషన్ గరుడ ను నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్ గరుడ లో భాగంగా శుక్రవారం ఉదయం గుణదలలోని ముందుల షాపులో ఆకస్మిక తనిఖీ చేశామన్నారు.

కొన్ని మత్తు ఇచ్చే టాబ్లెట్స్, ఇంజక్షన్స్ ను కొనుగోలు చేసి యువత బానిసలుగా మారుతున్నారు.. గంజాయిని కట్టడి చేస్తున్న నేపథ్యంలో యువత ఈవిధమైన నిబంధనలకు విరుద్ధంగా మందులను కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గతంలో కంటే కట్టుదిట్టంగా ఎన్‌డిపిఎస్ యాక్ట్ ను అమలు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు జరిపి అక్రమ అమ్మకాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈగల్ ఐజీ ఆకే రవి కృష్ణ తెలిపారు.

డ్రగ్స్ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మందులకు సరిగా బిల్లులు ఇవ్వని వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిస్క్రిప్షన్ మీద అమ్మవలసిన మందులు మాత్రమే మందుల షాపులో విక్రయించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మందులు అమ్మే మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# మాదకద్రవ్యాలతో సంపాదించిన ఆస్తుల జప్తు



మాదక ద్రవ్యాలతో సంపాదించిన ఆస్తులను జప్తు చేస్తామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హెచ్చరించారు. గంజాయి సమూలత నిర్మూలనకు కఠినచర్యలు చేపట్టామన్నారు. ఇటీవల మూడు జిల్లాల్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన గంజాయిని.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతకుంకాం గ్రామంలోని రైన్ బో ఇండస్ట్రీ వద్ద గురువారం డీఐజీ పర్యవేక్షణలో ముగ్గురు ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్ జిందాల్, ఎస్వీ మాధవరెడ్డి నిర్వీర్యం చేశారు. డీఐజీ మాట్లాడుతూ.. 'విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, వాటి మూలాలను గుర్తించి, బాధ్యులపై కేసులు నమోదు చేశాం. డీజీపీ హరీష్‌కుమార్ గుప్త ఆదేశాల మేరకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీ పురం మన్యం జిల్లాల పోలీసులు 226 కేసుల్లో సీజ్ చేసిన 7,378 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వీర్యం చేశాం. అనకాపల్లి జిల్లాలో ఈ ఏడాది జనవరిలో 34,419 కిలోల గంజాయి, 39.4 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను దహనం చేశాం. రెండో దశలో అల్లూరి సీతా రామరాజు జిల్లాలో గత నెల 3,075 కిలోల గంజాయిని, 25.5 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను నిర్వీర్యం చేశాం. మూడో దశలో గురువారం శ్రీకాకుళం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గడచిన 8 నెలల్లో గంజాయి పూర్తిస్థాయి నిర్మూ లనలో భాగంగా 524 కేసుల్లో 31,768 కిలోల గంజాయిని, 120.5 లీటర్ల హాషిష్, 372 వాహనాలను సీజ్‌చేసి 2,050 మంది నిందితులను అరెస్ట్ చేశాం. ఇందులో 575 మంది అంతరాష్ట్ర నిందితులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో రేంజ్ పరిధిలో ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని గుర్తించాం. 24 అంతరాష్ట్ర, 14 జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేశాం. డ్రోన్ కెమెరాల నిఘా ఏర్పాటు చేసి, 327 గ్రామాల్లో 90 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయిని నిర్వీర్యం చేశాం. గంజాయిని అక్రమంగా సాగుచేస్తున్న 34 అంతరాష్ట్ర ముఠా, 21 అంతర జిల్లాల ముఠాలను పట్టుకుని వారిలో 467 మంది ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర నిందితులుగా గుర్తించాం. ఈ కేసులకు సంబం ధించి 49 మందిపై పీడీ యాక్ట్, 1,031 మందిపై గంజాయి సస్పెక్ట్ షీట్స్ తెరిచాం. విశాఖ రేంజి పరిధిలో గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు 'సంకల్పం' పేరిట అవ గాహన కార్యక్రమాలు నిర్వహించి 5 లక్షల మంది విద్యార్థులకు చైతన్యం కలిగించాం. ప్రతి పాఠశాల, కళాశాలలో డ్రాప్ బాక్సును ఏర్పా టు చేశాం. 23 గంజాయి కేసుల్లో 40 మందికి న్యాయస్థానాల్లో శిక్ష ఖరారుకాగా, సుమారు 20 మందికి 20 ఏళ్లు కఠిన కారాగార శిక్షలు విధించారు. గంజాయి అక్రమ రవాణా ద్వారా సంపాదించే ఆస్తులను జప్తు చేస్తాం. ఇప్పటికే విజయనగరం, అనకాపల్లి జిల్లాలో చెరొకటి కేసుల్లో ఆస్తులు జప్తుచేశాం. రేంజ్ పరిధిలో గంజాయి వినియోగిస్తూ పట్టుబడిన 86 మందిని డి-అడిక్షన్ కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ ఇచ్చామ'ని తెలిపారు. 'గంజాయి సాగును నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ పంటలకుగాను రబీ సీజన్‌లో 4.68 ప్లాంట్లలో 22 రకాల విత్తనాలను 11ఎకరాల్లో సాగుకు అందజేశాం. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా 20మండలాల్లో 10,256 మంది రైతులు పంటలు పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే రాజ్మా చిక్కుడు విత్తనాలు 4,496 కిలోలు పంపిణీ చేశామ'ని డీఐజీ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు పి.శ్రీనివాసరావు, పి.సౌమ్యలత, అంకిత సూరన పాల్గొన్నారు.



# అందుబాటులోకి 'పురమిత్ర' యాప్




విజయనగరం (చైతన్యరథం): పురపాలిక సేవల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే ఇకపై ఈ కష్టాలు ఉండవు. పౌరసేవలను అందరికీ అందించేందుకు కూటమి ప్రభుత్వం 'పుర మిత్ర' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా పట్టణ ప్రజలు ఇంట్లోనే కూర్చుని పౌరసేవలను పొందే వీలు కల్పించింది. కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన ఈ యాప్‌లో పలు రకాల సేవలను ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సుమారు 5.75 లక్షల మంది సులభంగా పొందవచ్చు.

**పురమిత్ర యాప్‌తో 150 రకాల సేవలు :** సమస్యకు సంబంధించిన చిత్రాన్ని తీసి చరవాణిలో పెట్టి, విషయాన్ని వాయిస్ రికార్డులో పంపాలి. ఆ సమస్య సమాచారం సంబంధిత విభాగం అధికారికి చేరుతుంది. నుంచి 15 నుంచి 30 రోజుల గడువులోగా దీనిని పరిష్కరిస్తారు. యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దీనిని నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవ్వొచ్చు. పురపాలక రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజినీరింగ్, అకౌంట్స్, పరిపాలన విభాగాలకు సంబంధించి 150 రకాల పౌర సేవలను పొందుపరిచారు. ఇతర ప్రాంతాల్లో సమస్యనైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.

**సదా మీ సేవలో :** ప్రజల సమస్యను అధికారులకు తెలిపేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లాల్సిన అవసరం లేదు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు వంటి ఏ సమస్యనైనా సరే ఈ యాప్ ద్వారా తక్షణం తీసుకెళ్లవచ్చు. జనన, మరణ ధ్రువపత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ వంటివి ఇందులో పొందవచ్చు. మీ అనుమతితోనే చెల్లింపులు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించారు.

ప్రజలు పంపిన సమస్యను సకాలంలో అధికారులు పరిష్కరించాలి. ఏం చర్యలు చేపట్టారో ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వినతి పరిష్కారంలో పురోగతిని తెలుసుకోవచ్చు. అధికారి స్పందించకపోతే పైస్థాయి అధికారికి చేరుతుంది. అక్కడి నుంచి అపరిష్కృత జాబితాలో పడుతుంది. తరువాత దీని సంబంధిత అధికారిని బాధ్యుడిని చేస్తారు.

# రుషికొండ బీచ్ పరిసరాల్లో బ్లూఫ్లాగ్ సదుపాయాల



విశాఖపట్నం (చైతన్యరథం): రుషికొండ బీచ్ పరిసరాల్లో బ్లూఫ్లాగ్ బీచ్ కమిటీ (ఢిల్లీ) ప్రతినిధి బృందం శుక్రవారం పర్యటించి సదుపాయాల అమలు తీరును తెలుసుకున్నారు. రుషికొండ బీచ్కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణ దిశగా జరుగుతున్న అభివృద్ధి పనులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల తీరుతెన్నులపై ఆరా తీశారు సందర్శకులకు ఎలాంటి అసౌక్యకర పరిణామాలు. తలెత్తకుండా మరింత ఆహ్లాదాన్ని అందించే దిశగా మెరుగైన వసతులు కల్పించాలన్నారు. టూరిజం ఆర్డీ జి. జగదీష్, డీటీవో సుధాసాగర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

బలిజిపేట (చైతన్యరథం): ఉపాధి కూలీలకు బకాయి పడ్డ ఆరువారాల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలంటూ ఉపాధి కూలీలు ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బలిజిపేట మండలం ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘ మండల అధ్యక్షులు కార్యదర్శి పీసా వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు లేక ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు సుమారు 6000 మంది వలసలు పోయారన్నారు. ఈ వలసలు నివారించాలంటే తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. ఆరు వారాల పనులకు తక్షణమే బిల్లులు చెల్లించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల ఉదయం ఏడు నుంచి 11 గంటల్లో వరకు పనిచేయించాలన్నారు. ఈ మేరకు ఈఓపీఆర్డీ పుష్పరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు పాల్గొన్నారు.



**ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ**

మండల సమాఖ్య నందు ఉల్లాస్ పరీక్ష నిమిత్తం గ్రామ సంఘ అధ్యక్షులు, వీఓఏలకు శుక్రవారం ఇన్‌ఛార్జ్ ఏపీఎం కోటేశ్వరరావు సమావేశం నిర్వహించారు. మండలంలోని 30 గ్రామ సంఘాలలో 1728 అభ్యాసకులకు ఈనెల 23 న ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకూ (ప్రతీ అభ్యాసకులకు మూడు గంటల కాల వ్యవధి) వారీగా గ్రామాల్లో పాఠశాలలో పరీక్ష జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు గురుమూర్తి, రామారావు, కృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు రెయిన్ అలర్ట్



విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాలకు ఐఎండీ చల్లని ముచ్చట చెప్పింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇక, తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. పంటల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొనింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. కాగా, మరి కొన్ని చోట్ల వడగళ్ల వాన పడుతుందన్నారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు ఇచ్చింది. ఇక, నేడు (మార్చి 22) కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ ఉండగా.. మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని హైదరాబాద్ వాతారవణ శాఖ అధికారులు తెలిపారు. రేపు (మార్చి 23) పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉంది. మార్చి 24వ తేదీ నుంచి మళ్లీ పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని వెదర్ డిపార్ట్మెంట్ చెప్పుకొచ్చింది. అయితే, ఓవైపు ఎండలు.. మరోవైపు వర్ష సూచనతో తెలంగాణలో భిన్న వాతావరణం కనిపించనుంది. అయితే, ఆంధ్రప్రదేశ్ లో ఉపరితల ద్రోణి ప్రస్తుతం దక్షిణ ఛత్తీస్ ఘడ్ నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ, ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించిందని పేర్కొంది. దీని ప్రభావంతో ఏపీలో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందన్నారు. ఉత్తర కోస్తాలో ఈరోజు పొడి వాతావరణమే ఉండగా.. రేపు, ఎల్లుండి మాత్రం పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. మరి కొన్ని చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం పడే ఛాన్స్ ఉంది.

## గౌడ భవన్ స్థలానికి త్వరితగతిన అనుమతి ఇవ్వండి

**●బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కోరిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు బృందం**



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): గోపాలపురం నియోజకవర్గంలో గౌడ, శెట్టిబలిజ మరియు నాయీబ్రాహ్మణ కులాలకు భవనాలను ఏర్పాటు చేసుకోవడానికి ద్వారకాతిరుమలలో ఒక్కో సామాజిక వర్గానికి 50 సెంట్ల కేటాయింపు చేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు కోరారు. శుక్రవారం దాసరి శ్యామ్ చంద్ర శేషు ద్వారకాతిరుమల మండల బీసీ నేతలతో కలిసి బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవితకు వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటరాజు చొరవతో ఇప్పటికే భూములు కేటాయింపు జరిగిందని, అందుకు చట్టబద్ధంగా పూర్తి హక్కులు వచ్చేలా ఎమ్మెల్యే ఇచ్చిన సిఫర్సును వెంటనే పరిశీలించి జిల్లా కలెక్టర్ వారికి ఆదేశాలు ఇవ్వాలి అని కోరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే కలెక్టర్ కార్యాలయానికి లేఖ పంపించడం జరిగిందని, వీలైనంత త్వరలో దానికి అనుమతి వచ్చేలా కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారని శేషు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో దశాబ్దాల ఈ సామాజిక వర్గాల కల నెరవేరబోతుందని, ఎమ్మెల్యే వెంకట రాజుకు, మంత్రి సవితమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, లోకేష్‌కు కూటమి ప్రభుత్వానికి బీసీ నేతలతో కలిసి శ్యాం చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

## వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి



ఏలూరు (చైతన్యరథం): వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులు ఇవ్వాలని, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రేషనలైజేషన్ పేరుతో క్లస్టర్ విధానంలో పరిణామాలపై కలెక్టర్‌కు వివరించారు. క్లస్టర్ విధానం పేరుతో రెవెన్యూ విలేజ్‌లకు సంబంధం లేకుండా రెండు సచివాలయాలకు కలిపి ఒక్క క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం వల్ల పనిభారం పెరిగి రెవెన్యూ సేవలు ఆలస్యమవుతాయన్నారు. త్వరలో జరిగే కలెక్టర్ సదస్సులో క్లస్టర్ విధానంపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనా రాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఏలూరు డివిజన్ అధ్యక్షులు సాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి



పెనుగొండ (చైతన్యరథం): చెరువులో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకివీడు మండలం చిన్న కాపవరం చెందిన కటారిటింపు సాయి పవన్ (12), పెద్దకాపవరానికి చెందిన కౌరు శరత్ కుమార్ (13) పాతవయ్యేరు కాలువలో స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తూ ఇద్దరు చెరువులో మునిగి మృతి చెందారు. మృతదేహాలు చెరువులో తేలుతూ ఉండడంతో అటుగా వెళ్లిన స్థానికులు చూసి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆడుతూ పాడుతూ తిరిగిన చిన్నారులు ఒక్కసారిగా విగత జీవులుగా మారడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మహిళలు, పిల్లల సంరక్షణకు మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య

**● ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కేంద్రమంత్రి**



దిల్లీ/ ఏలూరు (చైతన్యరథం): మహిళా మరియు శిశు కౌన్సెలింగ్ కేంద్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు గత ఐదేళ్లలో కేటాయించిన నిధులు, ఏపీతో పాటు ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న మహిళా మరియు శిశు కౌన్సెలింగ్ కేంద్రాల సంఖ్య, మహిళా మరియు శిశు మానసిక నిపుణులు, థెరపిస్ట్‌లు మరియు సైకియాట్రిస్ట్‌ల పోస్టుల సంఖ్య, కౌన్సెలింగ్ కేంద్రాలలో ఖాళీల వివరాలపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ శుక్రవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. హింసకు గురై కష్టాల్లో ఉన్న మహిళలకు వన్ స్టాప్ సెంటర్లు అండగా నిలిచి సహాయాన్ని అందిస్తాయని, నిరుపేద మహిళలకు వైద్య సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక ఆశ్రయం, పోలీసు సహాయం, మానసిక సామాజిక కౌన్సెలింగ్ వంటి సేవలు అందుతాయని, నేరాల రేటు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఒకటి, అవసరమైతే అదనంగా మరొక ఓ.ఎస్.సి ఏర్పాటు చేస్తారని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 894 ఓ.ఎస్.సిలకు గాను, ఆంధ్రప్రదేశ్లో 26, ఏలూరు జిల్లాలో ఒకటి చొప్పున ఉన్నాయని, గత ఐదేళ్లలో వన్ స్టాప్ సెంటర్ల కోసం రూ.13.94 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ 'మిషన్ వాత్సల్య' పేరిట కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని, సంరక్షణ సేవలు, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ కేర్ సేవలు రెండింటినీ కలిగి ఉంటుందని, పునరావాస చర్యగా పిల్లల సంరక్షణ సంస్థల ద్వారా సంస్థాగత సంరక్షణ అందించబడుతుందని, వయస్సుకు తగిన విద్య, వృత్తిపరమైన శిక్షణ, వినోదం, ఆరోగ్య సంరక్షణ, కౌన్సెలింగ్ మొదలైన వాటికి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లో కౌన్సిలింగ్ సదుపాయం ఉంటుందని కేంద్ర మంత్రి బదులిచ్చారు. బెంగుళూరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ సహకారంతో మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, బాలల రక్షణ, మానసిక ఆరోగ్యం, మానసిక సంరక్షణ, ఇతర మానసిక సామర్థ్యాలను పెంపొందించే శిక్షణ అందిస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. మిషన్ శక్తి మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఓ.ఎస్.సి వద్ద ఒక సైకో సోషల్ కౌన్సెలర్‌తో సహా 13 మంది మానవశక్తి వనరుల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 100 శాతం ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని, మహిళలు మరియు పిల్లల సంబంధిత పథకాల అమలు కోసం మంత్రిత్వ శాఖ 'మిషన్ శక్తి' మరియు 'మిషన్ వాత్సల్య' మార్గదర్శకాలను విడుదల చేసిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## అందరికీ సురక్షితమైన త్రాగునీరు అందినప్పుడే అభివృద్ధి సాధ్యం



పాలకొల్లు (చైతన్యరథం): గత ప్రభుత్వం త్రాగు వ్యవస్థలను భ్రష్టు పట్టించాయని, ఎన్డీయే ప్రభుత్వం మంచినీటి పథకాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి రామానాయుడు అన్నారు. శుక్రవారం పాలకొల్లు మండలం లంకలకోడేరు, చినపేటలో రూ.2.50 కోట్లతో మంచినీటి పథకాలకు భూమిపూజలు, శిలాఫలకాన్ని మంత్రి రామానాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం జలజీవన్ మిషన్‌కు ప్రభుత్వం వాటా చెల్లించక లేకపోవుట వలన రాష్ట్రంలో మంచినీటి పథకాలకు నిధులు లేక రక్షిత మంచినీటిని ప్రజలకు అందించ లేకపోయారన్నారు. 2013 నారా చంద్రబాబునాయుడు పాదయాత్రలో రాత్రి 11 గంటలకు లంకలకోడేరు చెరువును ఫ్లాడ్ లైట్లతో చూపించడం జరిగింది అన్నారు. 12 అడుగుల లోతున కిక్కిస పేరుకు పోయిందని, సుమారు 20 గ్రామాలకు మంచినీటి సరఫరా అవుతుందని తెలియజేశామన్నారు. 2014లో 2.50 కోట్లతో మంచినీటి పథకాలకు అభివృద్ధి చేశామన్నారు. కొంతకాలం తర్వాత మెయింటెన్స్ లేక నిధులు లేక 20 గ్రామాలు సరఫరా అటు నుంచి కనీసం లంకలకోడేరు గ్రామానికి మంచినీటినికి ఇబ్బందులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వంలో కుళాయి నీళ్లు మొక్కలకు, కల్లాపుకు పనికి వచ్చేవని, అన్నం వడ్డుకోవడానికి వాడితే బియ్యం రంగు మారేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జలజీవన్ మిషన్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన త్రాగునీటిని రెండు పుటలూ పుష్కలంగా అందిస్తామన్నారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్లు లోటు బడ్జెట్ ఉన్నా అసలు, వడ్డీలు కడుతూ పేదవారి మీద భారం పడకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఒకేసారి పెంచిన పెన్షన్లు పంపిణీ, అన్నా క్యాంటీన్లు, దీపం-2 పథకం ద్వారా మహిళలకు మూడు గ్యాసు సిలిండర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. మే నాటికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం, వచ్చే విద్యా సంవత్సరం లోపుగా తల్లికి వందనం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అమలు చేస్తామన్నారు. విద్యా సంవత్సరంలోపుగా 16500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని, విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతను, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని మంత్రి రామానాయుడు అన్నారు.

## యువతకు అరోగ్యంతో పాటు ఆటపాటలు అవసరం

మండపేట (చైతన్యరథం): యువతకు ఆరోగ్యంతోపాటు ఆటపాటలు అవసరమని, అందుకు ఆటస్థలాలు, ఇండోర్ స్టేడియంలను నిర్మించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని కోరారు. తన నియోజకవ ర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆటస్థలాలు ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మండపేటలో క్రీడా వికాస ప్రాంగణానికి రూ.రెండు కోట్లను కేటాయిస్తే తర్వాత అధికారం చేప ట్టిన వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అవుట్‌డోర్, మున్సిపల్ కార్యాలయం వద్ద, కపిలేశ్వరపురంలో ఇండోర్ స్టేడియంలు ఏర్పాటుచేయాలని కోరారు.

## సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లుల ఆదా



దివాన్ చెరువు (చైతన్యరథం): ఇంటి పైకప్పుపై సౌరఫలకాలను ఏర్పాటుచేసుకోవడం ద్వారా విద్యుత్‌బిల్లులను తగ్గించుకునేందుకు ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ అన్నారు. ఈ మేరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎస్ఈ తిలక్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు వరకూ రాయితీ ఇస్తారన్నారు. మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునని చెప్పారు. కాగా రైతులు పంట పొలాల్లో సౌరప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు అమలు చేస్తున్న పీఎం కుసుమ్ పథకం కింద రాజానగరం మండలం కలవచర్లలో 2 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటుకు టెండర్లు పిలిచామన్నారు. గృహవినియోగదారులు 50శాతం రాయితీతో తమ విద్యుత్ అదనపు లోడ్ ను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించారన్నారు.

# గుడివాడ అభివృద్ధికి అందరం కలిసి నడుద్దాం: వెనిగండ్ల రాము

- రూరల్ మండలం చౌటపల్లిలో ప్రజా వేదిక నిర్వహించిన ఎమ్మెల్యే...



గుడివాడ (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలందరూ పాలు పంచుకోవాలని, గ్రామాల అభివృద్ధికి అందరం కలిసి నడుద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, కూటమి నేతలతో కలిసి ప్రజల నుండి వినతులను ఆయన స్వీకరించారు. ప్రజా వేదికలో వచ్చిన వినతులను పరిశీలించిన ఎమ్మెల్యే రాము... అధికారులతో మాట్లాడి పలు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వినతులు అందించేందుకు వచ్చిన గ్రామస్తులతో ఎమ్మెల్యే రాము ఆప్యాయంగా మాట్లాడారు. ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.... నియోజకవర్గ వ్యాప్తంగా కలియతిరిగిన తనకు ప్రజల సమస్యలపై అవగాహన ఉందన్నారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న త్రాగునీటి, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఆ దిశగా ముందుకు వెళుతూ ఇప్పటికే అనేక గ్రామాల్లో సమస్యలు పరిష్కరించినట్లు ఆయన తెలియచేశారు. సమస్యలను తెలిపేందుకు ప్రజలు ముందుకు రావాలని... అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. అందరూ కలిసి ముందుకు సాగితేనే గత ప్రభుత్వం చేసిన నష్టాల నుంచి బయటపడతామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు తాను నిరంతరం అందుబాటులో ఉంటానని... అసెంబ్లీ సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, లేదా అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం తాను అందుబాటులో లేకపోయినా ప్రజా వేదిక కార్యాలయంలో ప్రజలు తమ సమస్యలను తెలియచేయవచ్చనీ ఎమ్మెల్యే రాము తెలిపారు.

# ఎంటీఎంసీలో ముమ్మరంగా కొనసాగుతున్న స్వచ్ఛ-మంగళగిరి

- తెల్లవారుజాము నుంచే స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు
- ఐదవ రోజు మంగళగిరి 8, 9వార్డులు, తాడేపల్లి 5వ వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛ-మంగళగిరి కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఐదవ రోజు అయిన శుక్రవారం మంగళగిరి పట్టణం 8,9 వార్డుల్లోని కళ్యాణ మండపం రోడ్డు ,తెనాలి రోడ్డు, డాక్టర్ ఆంజనేయ కాలనీ, సాయి నగర్, వీవర్స్ కాలనీ, తాడేపల్లి పట్టణం 5వ వార్డుల్లో అధికారులు, కూటమి నాయకులు తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. పారిశుధ్య, పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. రోడ్లపై చెత్తను ఊ డ్చి శుభ్రం చేశారు. మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల నివారణకై ఫాగింగ్ చేశారు. తడి, పొడి చెత్త వేరు చేసే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ యస్. అలీం బాషా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశు భ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అందరికీ అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఎంటీఎంసీని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె శకుంతల,డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ అంజనా జేమ్స్ డిఈ రాము, ఏఈ అనూష, ఏఈ ప్రవీణ్, సెక్రటరీ యం దివ్యకుమారి, శానిటరి ఇన్స్పెక్టర్ ఆర్ ఇందు, ప్రత్యేక పర్యావరణ కార్యదర్శి ఉదయ్ సింగ్, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాద దుర్గారావు, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనంజయరావు పాల్గొన్నారు.



# ఆదరణ 3.0 పథకంపై గుంటూరులో అవగాహన సదస్సు



గుంటూరు (చైతన్యరథం): బీసీలకు వెన్నుదన్నుగా నిలిచే ఆదరణ 3.0 పథకం ప్రవేశపెట్టడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి టీడీపీ బీసీ విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్, బీసీ కుల ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం బీసీ వెల్ఫేర్ అధికారిణి కె.మయూరి ఆధ్వర్యంలో ఆదరణ పథకంపై ప్రత్యేక అవగాహనక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా టీడీపీ బీసీ విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ... బీసీలకు వెన్నుదన్నుగా ఆదరణ 3.0 పథకం ప్రవేశపెట్టడం, బీసీల్లో వెలుగులు నింపేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి అని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలోని బీసీ ప్రజలందరూ కృతజ్ఞతలు చెబుతున్నారు. కూటమి పాలనలో బీసీలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. కుల వృత్తులు చేసుకునే బీసీ సోదరులకు ఉండే పథకమే ఆదరణ పథకం. ఆదరణ పథకాన్ని మొట్టమొదటిసారిగా చంద్రబాబు ప్రవేశపెట్టారు. బీసీలకు ఆధునిక పనిముట్లు ఇస్తే వారు నైపుణ్యంతో ఇంకా బాగా అభివృద్ధి చెందుతారన్నది ఆయన ఆశయం. వారిని ఆర్థికంగా ముందుకు తీసుకె ళ్లాలనేదే చంద్రబాబుఆలోచన. రాష్ట్రంలో ఆదరణ 2 పథకం చంద్రబాబే ప్రవేశపెట్టారు. 2014-19 మధ్యన 135 కులాలకు రూ.964 కోట్లతో నాలుగు లక్షల మందికి 90 శాతం సబ్సిడీతో ఆనాడు పథకం తెచ్చారు. కులవృత్తులను బట్టి రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.30 వేలు ఖరీదు చేసే ఆధునిక పనిముట్లను అందజేశారు. కల్లు గీత కార్మికులు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, గొర్రెల కాపరులకు, వడ్డెర, భవన నిర్మాణ కార్మికులు, నాయి బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలరింగ్, పాల వ్యాపారం, ఎలక్ట్రీషియన్స్ ఇలా కొన్ని లక్షల మందికి తోడ్పాటునిచ్చారని గుర్తుచేశారు. 2019 తర్వాత జగన్ సీఎం అయ్యాక ఆదరణ పథకాన్ని ఎత్తేశారని, నేను విన్నాను... నేను ఉన్నాను అంటూ చెప్పే జగన్... బీసీలను నిండా ముంచేశారని అన్నారు. బీసీ రుణాల కోసం కేటాయించిన నిధుల్ని సైతం పక్కదారి పట్టించారని అన్నారు. వైసీపీ హయాంలో కల్లుగీత కార్మికులు చెట్టుపై నుంచి కిందపడి చనిపోతే రూ.10 లక్షలు ఇస్తానని చెప్పిన జగన్... ఇప్పటికి పది పైసలు ఇవ్వలేదన్నారు. జగన్ రెడ్డి బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేయటమే కాకుండా బీసీలకు వచ్చే రాయితీలు కూడా రద్దు చేశారని మండిపడ్డారు. బీసీల ద్రోహి జగన్ అయితే బీసీల బాంధవుడు చంద్రన్న అని వేములకొండ శ్రీనివాస్ కొనియాడారు.

# ఆంధ్రప్రదేశ్‌కి మరో అంతర్జాతీయ స్టేడియం

- వెల్లడించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



విజయవాడ (చైతన్యరథం): ఏపీలోని 175 నియోజకవర్గాల్లో ఏడాదికి 30 ఆట స్థలాల చొప్పున అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఏపీలో ఏసిఏ చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేసేందుకు శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కారణంగా తాను ఏసిఏ అధ్యక్షుడు అయినట్లు తెలిపారు. వైజాగ్ క్రికెట్ స్టేడియం పేరు గత ముప్పై ఏళ్లుగా ఏదైతే వుందో అదే వుందని, ఆ పేరు తొలగించలేదన్నారు. గతంలో వైజాగ్ స్టేడియంలో రెండు ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగాయి. ఈ సారి కూడా మ్యాచ్‌లు నిర్వహించాలని ఢిల్లీ కెప్టెన్స్‌ను అడిగాను... అయితే స్టేడియం నిర్వహణ, సదుపాయాలపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ జి.ఎమ్.ఆర్ యాజమాన్యంతో మాట్లాడగా, స్టేడియం ఆధునికరిస్తే మ్యాచులు నిర్వహణకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. డిసెంబర్ 20వ తారీఖు ఈ విషయం తెలిపారు. క్రిస్మస్, సంక్రాంతి వల్ల జనవరి 20 వరకు పనులు మొదలుపెట్టలేకపోయమన్నారు. సమారు ఎనిమిది నెలలు పట్టే పనులను ఒకటిన్నర నెలలో మార్చి 10 కల్లా స్టేడియం మొత్తం ఆధునీకరించినట్లు తెలిపారు. స్టేడియంలో 34 గదులతో పాటు, హైజినిక్‌గా వుండే 320 టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో స్టేడియంలో 53 టాయిలెట్లు మాత్రమే వుండేవన్నారు. స్టేడియం మొత్తం ఎల్.ఈ.డీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రెస్ గ్యాలరీ కూడా ఆధునీకరించినట్లు చెప్పారు. ఇటీవల ఢిల్లీ కెప్టెన్స్ ప్రతినిధుల బృందం స్టేడియం ఆధునికరణ పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేసిందని, మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు ఇండియాలోనే ది బెస్ట్ డ్రెసింగ్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు ప్రశంసించారని తెలిపారు. అంతే కాదు రెండు నెలల్లో పూర్తిచేసిన విధానాన్ని మెచ్చుకున్నారని చెప్పారు. సెక్యూరిటీ పనుల వల్ల స్టేడియం ఎలివేషన్ పనులు నిలిపివేశామని, రెండు ఐపిఎల్ మ్యాచులు పూర్తి అయిన తర్వాత ఎలివేషన్ పనులు మొదలు పెడతామన్నారు. ఎలివేషన్ కూడా చాలా అందంగా వుంటుందన్నారు. ప్రేక్షకులకు వినోదం పంచేలా వైజాగ్ క్రికెట్ స్టేడియం వుందన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన 800 మంది రాత్రి, పగలు కష్టపడటం వల్ల , అపెక్స్ కౌన్సిల్ సభ్యుల సహకారంతో రెండునెలల్లో పూర్తి చేయటం జరిగిందన్నారు. అమరావతిలో కూడా స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అమరావతిలో నిర్మించబోయే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం రెండున్నరేళ్లలో పూర్తి చేయటం జరుగుతుందన్నారు. ఏ క్రికెట్ స్టేడియం నిర్మించాలన్న బిసిసిఐ అనుమతి తీసుకోవాలి. ఐసిసి చైర్మన్ జైషాను అడగటం జరిగింది. సానుకూలంగా స్పందించారు. అయితే మంత్రి నారా లోకేష్ అడిగిన తర్వాత వెంటనే అనుమతి ఇచ్చారన్నారు. స్టేడియం 365 రోజులు పనిచేసే విధంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఆ ప్రణాళిక ప్రకారం రాబోయే రెండున్నర సంవత్సరాల్లో స్టేడియం నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వస్తుందన్నారు.త్వరలో మరో అంతర్జాతీయ స్టేడియం ఆంధ్రప్రదేశ్ కి రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీడీపీ రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం, టీడీపీ సీనియర్ నాయకులు నరసింహాచౌదరి పాల్గొన్నారు.

# అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి : గల్లా మాధవి

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



గుంటూరు (చైతన్యరథం): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు సోదరభావం పెంపుతో పాటు మతసామరస్యానికి ప్రతీక అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు 39వ డివిజన్ మారుతి నగర్‌లో కొండబోయిన శ్రీను ఆధ్వర్యంలో గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదర, సోదరిమణులతో కలిసి దీక్ష విరమణ మరియు నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదర, సోదరిమణులకు ఎమ్మెల్యే స్వయంగా ఇఫ్తార్ విందును వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. కఠినమైన ఉపవాస దీక్షల ద్వారా క్రమ శిక్షణ ఏర్పడుతుందన్నారు. సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదర భావంతో ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అనంతరం గుంటూరు తాత్కాలిక మేయర్‌గా షేక్ సజిల శుక్రవారం మున్సిపల్ కార్పోరేషన్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ కార్యక్రమంలో పాల్గొని సజిలకు శుభాకాంక్షలు తెలిపారు.

# గడువులోగా 303 అభివృద్ధి పనులు పూర్తవ్వాలి



- అధికారులకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశం
- పార్టీ నేతలంతా నిమగ్నం కావాలని పిలుపు

నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇంఛార్జులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ఈ నెలలో చేసిన 303 అభివృద్ధి పనుల శంకుస్థాపనలు చేసినవన్నీ అనుకున్న గడువులోగా రోజుల్లో పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. దగ్గరుండి పనుల వేగవంతంతో పాటు, నాణ్యతా ప్రమాణాలపై దృష్టి సారించాలని కోరారు.

మే 20వ తేదీ లోపల ఈ 303 అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరగడానికి వీలుగా ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక సవాలుగా తీసుకోవాలని కోరారు. ఎక్కడైనా పనులు ప్రారంభం కాకున్నా ఆ పనులు వెంటనే ఆ పనులు వేరే డివిజన్‌కు మార్పిస్తానని, ఇది తప్పనిసరి అని, తన తపనను అర్థం చేసుకోవాలని పార్టీ నాయకులను, కార్యకర్తలను

# మహిళల జోలికొస్తే తాట తీసెయ్యండి

*నా బంధువులైనా ఉపేక్షించొద్దు - పోలీసులకు ఎమ్మెల్యే కాకర్ల ఆదేశం*

జలదంకి, (చైతన్యరథం): ఉదయగిరి నియోజకవర్గంలో ని ఆడపడుచులు ,అక్క చెల్లెమ్మల, జోలికి ఎవరైనా వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని, చట్టానికి వారు అతీతులు కారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ సయ్యద్ లతీపున్నిషాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశించారు. జలదంకి మండలం కమ్మవారిపాలెంలో మహిళలపై జరిగిన దాడి విషయం తెలుసుకున్న ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ తీవ్రంగా స్పందించారు. అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఉన్నప్పటికీ ఆడపడుచులపై జరిగిన దాడిని తెలుసుకొని వెంటనే స్పందించి కలిగిరి సీఐ వెంకటనారాయణతో జలదంకి ఎస్ ఐ సయ్యద్ లతీ పున్నిషాతో నేరుగా ఫోన్లో మాట్లాడుతూ నిందితులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు ఇచ్చారు. మహిళల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి హాని తలపెడితే సహించనన్నారు.



# తాగునీటి ఎద్దడిపై దృష్టి పెట్టండి

**- కలెక్టర్‌ను కోరిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**



దర్శి, (చైతన్యరథం): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను టీడీపీ దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కోరారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని నియోజకవర్గంలోని సమస్యలను వినిపించారు. ముఖ్యంగా రానున్న వేసవిలో దర్శి పట్టణంలో గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని కోరారు. అవసరమైన గ్రామాలలో పట్టణంలో వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటి అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సాగర్ కాలువ నీటిని కూడా అందించాలని కోరారు. తాగునీటి అంశంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే గ్రామాలలో చెరువులన్నీ నీటితో నింపామని వాటర్ ట్యాంకుల్లో కూడా నీరు ఉంచామని ఇప్పటికే ట్యాంకుల ద్వారా కూడా నీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. ఇంకా అవసరమైన చోట కూడా సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని లక్ష్మి తెలిపారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలా అంతర్గత రోడ్లు అనుబంధ రోడ్లను నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మౌలిక వసతులను కల్పించాలని డాక్టర్ లక్ష్మి కోరారు. దీనిపై కూడా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. 50 లక్షల రూపాయల నిధులతో తిమ్మాయిపాలెం ఎస్సీ కాలనీ, కట్టుబడివారి పాలెం ఎస్సీ కాలనీ రోడ్డును నిర్మించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు లక్ష్మి తెలిపారు. అంతేకాక పెండింగ్ బిల్లులు వివిధ కార్యాలయంలో సిబ్బంది కొరత మరికొన్ని ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు.

**పవన సుతుని సేవలో డాక్టర్ గొట్టిపాటి**

దర్శి పట్టణంలో శుక్రవారం జరిగిన ప్రసన్నాంజనేయస్వామి తిరునాల సందర్భంగా దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి మెయిన్ బజార్‌లోని ఆంజనేయ స్వామి, కురిచేడురోడ్‌లోని ఆంజనేయ స్వామి వర్లను దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆర్యవైశ్య నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దర్శి పట్టణం లో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన మజ్జిగ, పులిహార పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మేరు బోయిన సేవలు మరువలేనివి

**డాక్టర్ నూకసాని నివాళి**

కనిగిరి, (చైతన్యరథం): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం మోపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పామూరు మండలం మాజీ జడ్పీటీసీ సభ్యులు మేరుబోయిన హుస్సేన్ రావు యాదవ్ (60) మరణవార్త విని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మేరుబోయిన హుస్సేన్ రావు యాదవ్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, "మేరుబోయిన హుస్సేన్ రావు యాదవ్ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఆదర్శవంతమైన నాయకులన్నారు. ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి, ప్రజలకు తీరని లోటు" అని అన్నారు. హుస్సేన్ రావు యాదవ్ సేవలను గుర్తు చేసుకుంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం, సహనం ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీడీపీతోనే చేనేతలకు చేయూత

**- చీరాలలో చేనేతల పాదయాత్ర**

**- చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం**



చీరాల, (చైతన్యరథం): చేనేతలకు మొదటి నుంచి చేయూతనిచ్చేది తెలుగుదేశమేనని చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం చీరాల బస్టాండ్ దగ్గర తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముక్కోసపు పార్కు దగ్గర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, గడియార స్తంభం దాకా చేనేతలతో పాదయాత్రగా వచ్చి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయనతోపాటు ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, కూటమి నాయకులు, చేనేత కార్మికులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతలకు మొదటి నుంచి చేయూతనిచ్చేది తెలుగుదేశం పార్టీయేనన్నారు. చేనేతలకు గతంలో రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుదేనని గుర్తు చేశారు. చంద్రబాబు స్ఫూర్తితో చేనేతల ఇళ్లకు 200యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు మంత్రి లోకేష్ కృషి చేశారన్నారు. అలాగే శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య చీరాలలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో చేనేత దినోత్సవం నాడే నేతన్నల ఆత్మహత్యలు జరిగేవని అన్నారు. కూటమి ప్రభుత్వంలో చేనేతలకు ప్రతీరోజూ పండుగేనన్నారు. అనంతరం మిఠాయిలు పంచి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చేనేత కార్మికులు తెలుగుదేశం జనసేన, బీజేపీ నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు సన్నిహితులు పాల్గొన్నారు.

# దుగ్గిశెట్టి కోటయ్య సంకల్పం చిరకాలం నెరవేరాలి

కోవూరు, (చైతన్యరథం): కోవూరు తాలుకా ఆఫీస్ సెంటర్‌లో ఉన్న దుగ్గిశెట్టి కోటయ్య వైశ్య సత్రం వద్ద సత్రం వ్యవస్థాపకులు దుగ్గిశెట్టి కోటయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు దుగ్గిశెట్టి రామమూర్తి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి శుక్రవారం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా సౌకర్యాలు సరిగాలేని రోజుల్లో బాటసారులు సేద తీరడం కోసం దుగ్గిశెట్టి కోటయ్య ఈ సత్రాన్ని నిర్మించారన్నారు. ఈ సత్రానికి ఉన్న ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వైశ్య విద్యార్థులు చదువుకోసం ఉపయోగించాలని కోటయ్య సంకల్పించారన్నారు. దుగ్గిశెట్టి కోటయ్య వారసులు రామమూర్తి ఈ సత్రం బాధ్యతలు తీసుకొన్న తర్వాత, గత 11 సంవత్సరాలుగా దేవాదాయ శాఖ సహకారంతో అనేక సేవా




**పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి ఆకాంక్ష**

**వారసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం**

కార్యక్రమాలు చేపడుతున్నారని వెల్లడించారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో చలివేంద్ర ఏర్పాటు చేయడంతో పాటు, పేద వైశ్య విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తూ వారు చదవు కొనేందుకు సహాయం చేస్తున్నారన్నారు. కోటయ్య ఏ ఆశయాలతో సత్రాన్ని ఏర్పాటు చేశారో, ఆ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న రామమూర్తికి అభినందనలు తెలియచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమములో దుగ్గిశెట్టి కోటయ్య సత్రం నిర్వాహకులు దుగ్గిశెట్టి రామమూర్తి, ప్రముఖ న్యాయవాది మడపర్తి రవీంద్ర, సమాచార హక్కు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.విజయకుమార్, రామమూర్తి మిత్రులు తెలుగుదేశం పార్టీ నాయకులు కలికి సత్యనారాయణ రెడ్డి, గొర్రెపాటి నరసింహా, ఇందుపూరు మురళి కృష్ణ రెడ్డి,చిట్టమూరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన పుట్టపర్తి జనం

## తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే సింధూర, మాజీ ఎమ్మెల్యే పల్లె

పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని పెద్ద బజారు పీర్ల సావిడి తదితర ప్రాంతాల్లో త్రాగునీటి ఎద్దడి పై మహిళలు రోడ్డెక్కిన విషయంపై ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తీవ్రంగా పరిగణించారు. పుట్టపర్తిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని నీటి ఎద్దడి ఉన్న ఆయా కాలనీలను ముందస్తుగా గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రజల సమస్యలు గాలికి వదిలేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ విషయాలపై తన దృష్టికి లేదా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దృష్టికి లేదా జిల్లా



కలెక్టర్ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇకపై పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో త్రాగునీటి సమస్య ఉన్నట్లు తిరిగి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే వారిపై పాలనా పరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సంబంధిత మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి పుట్టపర్తిలో త్రాగునీటి ఎద్దడి పై మీడియాలో వచ్చిన కథనంపై స్పందించి పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద,త్రాగు నీటి విభాగం అధికారులతో విజయవాడ నుంచి ఫోన్ ద్వారా ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజల ప్రధాన సమస్యలైన తాగునీరు పారిశుద్ధ్యం వైద్యం వంటి విషయాల్లో అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో త్రాగునీటి ఎద్దడి లేకుండా తక్షణం నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. పుట్టపర్తి మున్సిపల్ అధికారులు సంబంధిత ప్రాంతాల్లో ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేశారు. సంబంధిత కాలనీలో కాలిపోయిన మోటార్లను వెంటనే మరమ్మతు చేసి నీటిని విడుదల చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రహ్లోద తెలిపారు.

## దుర్గమ్మ సన్నిధిలో పరిటాల కుటుంబం

ఎమ్మెల్యే సునీతతో పాటు కుటుంబ సభ్యుల ప్రత్యేక పూజలు

పున్నమి ఘాట్ నుంచి బోట్ లో విహారం

భవానీ ఐల్యాండ్ ద్వీపాన్ని సందర్శించిన పరిటాల కుటుంబ సభ్యులు



విజయవాడ /రాప్తాడు (చైతన్యరథం): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులు శుక్రవారం రోజు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సతీమణి జ్ఞాన, పిల్లలతో పాటు, సోదరునితో కలిసి ఎమ్మెల్యే సునీత దుర్గమ్మ ఆలయానికి వెళ్లారు. ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యే కుటుంబానికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అర్చకులు వారికి ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. ఆ తర్వాత తన కుటుంబసభ్యులతో కలిసి పున్నమి ఘాట్ నుంచి బోట్ ప్రయాణం చేశారు. తన మనవడు, మనవరాలితో ఎమ్మెల్యే సునీత ఎంతో సందడిగా గడిపారు. భవాని ఐల్యాండ్ ద్వీపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.... శుక్రవారం దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు మా కుటుంబంతో పాటు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. భవాని ద్వీపాన్ని సందర్శించేందుకు బోటులో వెళ్లడం ఒక ప్రత్యేక అనుభూతినిచ్చిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు.

## మంచి మనసున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కర్నూలు టీడీపీ ప్రధానకార్యదర్శి ప్రభాకర్ మాదిగ



కర్నూలు, (చైతన్యరథం): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరుగకుండా వైసీపీ ఎన్నో కుట్రలు కుయుక్తులకు పాల్పడినా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో వర్గీకరణ చేశారనీ మాదిగలు తరతరాలుగా ఆ మేలును గుర్తుపెట్టుకుంటారని తెలుగుదేశంపార్టీ కర్నూలు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకొన్నారనీ మొదటి నుండి ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉన్న నారా చంద్రబాబునాయుడు తన హయాంలోనే వర్గీకరణ చేసి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఈ విషయమై స్పందిస్తూ జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుండి పత్రికల వారితో మాట్లాడుతూ యస్.సి. వర్గీకరణ కోసం గత 30 సంవత్సరముల నుండి సుదీర్ఘ పోరాటం జరిగిందనీ, 1995లో ముఖ్యమంత్రిగా భాద్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు వర్గీకరణ ఉద్యమం ప్రారంభమైనది మొదలుకొని అన్ని విధాలుగా ప్రభుత్వపరంగా నిర్ణయాలు చేశారనీ తెలిపారు. 2011 జనాభా ప్రాతిపదికన రాష్ట్ర యూనిట్గా 2026 జనన గణన తో జిల్లాను యూనిట్గా పరిగణలోకి తీసుకొని ఈ వర్గీకరణ ప్రక్రియను మొదలు పెట్టనున్నారనీ తెలిపారు. యస్.సి.లలో గడిచిన 75 సంవత్సరాల కాలంలో వివక్షకు గురైన మాదిగలకు యస్.సి. వర్గీకరణతో న్యాయం చేకూరుతుందనీ వివరించారు. ఈ సందర్భంగా ఉద్యామాన్ని ముందుకు నడిపించిన మందక్రిష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## అసెంబ్లీలో గళమెత్తిన ప్రజావాణి... క్రీడల్లో రాణించిన చిచ్చర పిడుగు!

పుట్టపర్తి, (చైతన్యరథం): మామకు తగ్గ కోడలు అనిపించుకుంటున్నారు. యువ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి. సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో చాకచక్యంగా వినిపిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రాణించారు. ఫిబ్రవరి 24న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు మార్చి 20 వరకు కొనసాగాయి. సుమారు 15 రోజులపాటు కొనసాగిన శాసనసభ సమావేశాల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సుమారు 15 ప్రశ్నలను వివిధ రకాల నియోజవర్గ సమస్యలపైనే కాకుండా ఇతర ముఖ్యమైన సమస్యలను కూడా అసెంబ్లీలో ప్రస్తావించారు. తన వాక్చాతుర్యంతో నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో అందరినీ ఆకట్టుకున్నారు. అసెంబ్లీలోనే కాకుండా శాసనసభ్యులకు మూడు రోజులుగా నిర్వహించిన క్రీడల్లో కూడా అద్భుతంగా రాణించి ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. గతంలో నల్లమాడ, ఆ తర్వాత ఏర్పాటు అయిన పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో సింధూర ప్రత్యేకత సంతరించుకున్నారు. ఆమె మామ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వ విప్‌గా, ఎమ్మెల్సీగా , మంత్రిగా, ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేసిన కాలంలో నియోజకవర్గ సమస్యలపైన, ఇతర సమస్యలపై అసెంబ్లీలో పెద్ద గళం వినిపించేవారు. ప్రస్తుతం



సీఎం సహా ప్రముఖుల ప్రశంసల జల్లు

మామకు తగ్గ కోడలు ఎమ్మెల్యే పల్లె సింధూర




అసెంబ్లీలో నిత్యం ప్రజల సమస్యలపై గళం విప్పుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తన మామకు తగ్గ కోడలు దొరికిందని చెప్పుకుంటున్నారు. పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో తన మాటలతోనే కాకుండా శాసనసభ్యులకు ఎమ్మెల్సీలకు ప్రభుత్వం నిర్వహించిన మూడు రోజుల క్రీడా పోటీల్లో కూడా తన అద్భుత ఆటతీరుతో ప్రతిభ కనబరిచి విజయం సాధించారు. ఎంతో ఉన్నత కుటుంబంలో జన్మించినప్పటికి హంగు అర్భటాలకు ఏ మాత్రం వెళ్లకుండా సాధారణ జీవితం గడిపారు. తండ్రి శంకర్ రెడ్డి కేరళ డీజీపీగా పనిచేసినప్పటకీ అన్ని హెూదాలు పక్కన బెట్టి ఇవి ఏ మాత్రం పట్టించుకోకుండా చదువులోనూ రాణిస్తూ పల్లె సింధూర రెడ్డి గోల్డ్ మెడల్ సాధించి చదువుల్లో సక్సెస్ అయ్యారు. వివాహ జీవితంలో కూడా అందుకు తగ్గట్టుగా కోట్ల ఆస్తికి అధిపతి, 14 విద్యా సంస్థలను స్థాపించి అటు విద్యావేత్త, ఇటు రాజకీయ వేత్త అయిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఏకైక సంతానం ఉద్యోగం లో స్థిరపడిన పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డితో సింధూర రెడ్డి వివాహం మధుర ఘట్టంగా నిలిచింది. ఇక ఇక్కడి నుంచి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రజలతో మమేకమై పాలనలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. 15 రోజులపాటు సాగిన శాసనసభ సమావేశాల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సుమారు 15 అత్యంత ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే కాకుండా శాసనసభ్యులకు ఎమ్మెల్సీలకు ప్రభుత్వం మూడు రోజులు నిర్వహించిన క్రీడా పోటీల్లో కూడా అత్యంత ప్రతిభను కనబరిచి విజయం సాధించారు. మామ పల్లె రఘునాథ్ రెడ్డి కి తగ్గ కోడలు అని నిరూపించుకున్నావ్ అని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతులమీదుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రశంసలు అందుకున్నారు.అసెంబ్లీలో యువ ఎమ్మెల్యేగా పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఫిబ్రవరి 24న అసెంబ్లీ ప్రారంభముగా 28న బడ్జెట్ ప్రవేశపెట్టారు. మార్చి 3న జరిగిన శాసనసభ సమావేశాల్లో ప్రజలకు అనుకూలంగా ప్రజా రంజక బడ్జెట్ ఎంతో అద్భుతంగా ఉందని ప్రసంగించారు. అదే రోజు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



### వెనక్కు పంపుతున్నారు సరే

# మరి మహిళలకు, చిన్నారులకు సంకెళ్ళేమిటి

### *అమెరికా అధికారుల తీరును ప్రశ్నించిన భారత్*



డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. దీంతో విడతల వారీగా పలువురు స్వదేశానికి తిరిగొచ్చారు. త్వరలో మరో 295 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అక్రమ వలసల అంశంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. ఈ సందర్భంగా భారత్‌కు పంపించిన వలసదారుల పట్ల అమెరికా అధికారులు వ్యవహరించిన తీరుపైనా కేంద్రం స్పందించింది. దీనిపై తమ ఆందోళనను అగ్రరాజ్యానికి తెలియజేసినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 5న భారత్‌కు పంపించిన అక్రమ వలసదారులకు, ముఖ్యంగా మహిళలకు సంకెళ్లు వేసిన అంశాన్ని అమెరికా వద్ద లేవనెత్తినట్లు తెలిపింది. దీనికి అగ్రరాజ్యం కూడా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించింది. "భారత్ ఆందోళనల తర్వాత ఫిబ్రవరి 15, 16 తేదీల్లో పంపించిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని అమెరికా ధ్రువీకరించింది. వలసదారులు స్వదేశానికి చేరుకున్న తర్వాత వారితో చర్చించి మన అధికారులు కూడా దీన్ని నిర్ధారించుకున్నారు. ఇక, అమెరికాలో చట్టవ్యతిరేకంగా నివాసం ఉంటున్న వారిలో మరో 295 మంది భారతీయులు త్వరలోనే స్వదేశానికి రానున్నారు. ప్రస్తుతం సంబంధిత ఏజెన్సీలు వారి వివరాలను పరిశీలిస్తున్నాయి" అని విదేశాంగశాఖ తమ సమాధానంలో పేర్కొంది. ఫిబ్రవరి 5 నుంచి ఇప్పటివరకూ 388 మంది భారత అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో అగ్రరాజ్యం వెనక్కి పంపింది. వీరిలో అత్యధికంగా 40శాతం మంది పంజాబ్ వాసులు కాగా, 34శాతం హరియాణాకు చెందిన వారు ఉన్నారు. అయితే, వీరి చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులతో బంధించి పంపడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కేంద్రం కూడా స్పందించింది. మరోవైపు, ఈ డిపోర్టేషన్ ప్రక్రియ కొన్నేళ్ల నుంచి సాగుతోందని ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. 2009 నుంచి 2024 వరకు దాదాపు 15,500 మందిని అమెరికా వెనక్కి పంపించినట్లు గుర్తుచేసింది.

# ఆ జడ్జి తీర్పు న్యాయ సమ్మతం కాదు



అత్యాచార కేసు విచారణ సందర్భంగా ఇటీవల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. మహిళ ఛాతీని తాకడం అత్యాచారం కిందకు రాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ తీర్పు సమ్మతం కాదని పేర్కొన్నారు. దానిని పరిశీలించాలని సుప్రీంకోర్టును కోరారు. ఇలాంటి తీర్పులతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందన్నారు.

అసలేం జరిగిందంటే..?

2021 నవంబరు నాటి లైంగిక వేధింపుల కేసు ఇది. ఉత్తరప్రదేశ్లోని కసగంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన 11 ఏళ్ల (ఘటన జరిగే నాటికి) కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగివస్తుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వారిని సమీపించారు. బాలికను ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో ఆ యువకులు. అమ్మాయిపై అత్యాచారానికి యత్నించారు. ఆమెను అసభ్యంగా తాకుతూ వేధింపులకు గురిచేశారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. ఇటీవల దీనిపై విచారణ జరిపిన జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళ ఛాతీని తాకినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ నిందితులకు అనుకూలంగా తీర్పు వెలువరించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి స్పందించారు.

# న్యాయమూర్తుల ఇళ్లలో నోట్లకట్టలు

### *నిగ్గు తేల్చమంటున్న కొలీజియం సభ్యులు - పరువు, ప్రతిష్టలను కాపాడాలని సూచన*




డిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో 14వ తేదీన అగ్నిప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీఎత్తున డబ్బు కనిపించింది. దీంతో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం స్పందించి ఆయన్ను మరో హైకోర్టుకు బదిలీ చేసింది. ఈ ఘటన న్యాయవర్గాల్లో సంచలనం సృష్టించింది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో జస్టిస్ వర్మ నగరంలో లేరు. ఆయన కుటుంబసభ్యులే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు ఫోన్ చేసి పిలిపించారు. వారు అక్కడ అగ్నికీలలను ఆర్పేశాక.. అక్కడ భారీఎత్తున నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు దానిని స్వాధీనం చేసుకొన్నారు. అది మొత్తం లెక్కల్లో చూపని నగదుగా గుర్తించారు. వెంటనే ఈ విషయం ఉన్నతాధికారుల ద్వారా సీజేఐ ఖన్నాకు చేరింది. దీనిని ఆయన తీవ్రంగా పరిగణించి వెంటనే కొలీజియం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ వర్మను అలహాబాద్‌కు బదిలీ చేయాలని నిర్ణయించారు. గతంలో వర్మ అక్కడే పనిచేసి 2021లో దిల్లీకి వచ్చారు. ఐదుగురు సభ్యులున్న కొలీజియంలో కొందరు జస్టిస్ వర్మ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించారు. కేవలం బదిలీతోనే న్యాయశాఖ ఇమేజ్ తిరిగిరాదన్న అభిప్రాయం వ్యక్తంచేశారు. వర్మను రాజీనామా చేయాలని కోరడమో.. ఆయనపై సీజేఐ అంతర్గత విచారణ చేపట్టడమో చేయాలన్న అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఇటువంటి ఘటనే 2008 ఆగస్టు 13వ తేదీన ఒకటి చోటుచేసుకొంది. నాటి పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్జిత్ కౌర్ ఇంటి ఎదుట రూ.15 లక్షల నోట్లు ఉన్న బాక్సును కొందరు వ్యక్తులు ఉంచారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ తర్వాత ఈ కేసును సీబీఐకు అప్పగించారు. దర్యాప్తు అనంతరం 2011 మార్చిలో ఉత్తరాఖండ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ నిర్మల్ యాదవ్‌పై అభియోగాలు నమోదు చేశారు. ఆమె 2009 వరకు పంజాబ్-హరియాణా కోర్టులో పనిచేశారు. ఓ కేసులో తీర్పు నిమిత్తం నిర్మల్ యాదవ్‌కు ఇవ్వాల్సిన డబ్బును పొరబాటున జస్టిస్ నిర్మల్ జిత్ కౌర్ ఇంటి వద్ద పెట్టినట్లు తేలింది.

### ఆకాశంలో విమానం..

## ప్రయాణికుడి ప్రాణాలు గాల్లో




ఢిల్లీ నుంచి లఖనవూ వెళ్తున్న విమానం గాల్లో ఉండగానే ఓ ప్రయాణికుడు అస్వస్థతతో మృతి చెందాడు. దిల్లీ నుంచి బయలుదేరిన ఎయిరిండియా విమానం శుక్రవారం ఉదయం 8.10 గంటలకు లఖనవూలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. ప్రయాణికులు విమానం దిగుతున్న సమయంలో సీట్లు శుభ్రం చేస్తున్న సిబ్బంది ఓ వ్యక్తి వద్దకువెళ్లగా.. అతడు ఎటువంటి చలనం లేకుండా పడి ఉండడం గమనించారు. అందులో ఉన్న వైద్యులు అతడిని పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం అందించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడిని ఢిల్లీకి చెందిన అసిఫ్ ఉల్లా అన్సారీగా గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. విమానం ఎక్కిన అనంతరం అతడికి ఇచ్చిన ఆహార పదార్థాలు అలాగే ఉండడం, సీటు బెల్ట్ కూడా తీయకపోవడంతో గాల్లో ఉన్న సమయంలోనే మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. అతడు మృతి చెందడానికి గల కారణాలు తెలియరాలేదని.. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపామని తెలిపారు. అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించామన్నారు.

## కశ్మీర్‌లో తారాడుతున్న శాంతికపోతాలు

- ఉగ్రవాదంపై నాడు ఉదాశీనం.. నేడు ఉక్కుపాదం
- వచ్చే ఏటికల్లా వామపక్ష తీవ్రవాదం అంతం
- రాజ్యసభలో హెూంమంత్రి అమిత్‌షా



ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల కఠిన వైఖరి అనుసరిస్తోందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు. కాశ్మీర్‌లో ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని, అక్కడి యువకులు ఉద్యోగాలు చేసుకుంటున్నారని తెలిపారు. సినిమాహాళ్లు నిండుతున్నాయని వెల్లడించారు. శుక్రవారం రాజ్యసభలో మాట్లాడుతూ గత ప్రభుత్వాల పనితీరుపై మండిపడ్డారు. అవి ఉగ్రవాదుల పట్ల మెతకవైఖరి అనుసరించాయని దుయ్యబట్టారు. "జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఉగ్రవాదం, తీవ్రవాదం దేశ వృద్ధికి ఆటంకాలు. వాటి వల్ల 92వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మోదీ ప్రభుత్వ పాలనలో జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతం తగ్గాయి. ఉగ్రఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా 'ఒకే రాజ్యాంగం- ఒకే జెండా' అనే రాజ్యాంగ నిర్మాతల కలను మోదీ ప్రభుత్వం నెరవేర్చింది. ఇప్పుడు కశ్మీర్లో సాయంత్రం పూట కూడా సినిమాహాళ్లు తెరిచే ఉంటున్నాయి. జీ20 సమావేశాలు జరిగాయి. 2019 నుంచి 2024 వరకు అక్కడి యువతకు 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య, పెట్టుబడులు పెరిగాయి". "ఉరి, పుల్వామా ఘటనలు జరిగిన రోజుల వ్యవధిలో మెరుపు దాడులు, వైమానిక దాడులు చేసిన ఈ ప్రభుత్వం పాకిస్థాన్‌కు గట్టి బదులిచ్చింది. అలాగే మార్చి 31, 2026 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమవుతుంది. రాజకీయ భావజాలం మద్దతున్న ఉగ్రవాదాన్ని విస్తరించకుండా అడ్డుకుంటాం. అలాగే రూ.1.25 లక్షల కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశాం" అని కేంద్రహెూంశాఖ పనితీరుపై చర్చ సందర్భంగా అమిత్ షా వెల్లడించారు.

# ఎవరి జోలికి వెళ్ళం.. మా జోలికొస్తే ఊరుకోం

## ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ సుప్రీం లీడర్ స్పందన



యెమెన్‌లోని హూతీలపై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూతీ తిరుగుబాటుదారుల చర్యలకు ఇరాన్‌తో ముడిపెడుతూ తదుపరి దాడులకు పాల్పడితే టెహ్రాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. యెమెన్‌కు చెందిన హూతీలు తాము చెప్తే దాడులకు పాల్పడట్లేదని.. ఆ విషయంలో వారికి సొంత కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. తాము ఎప్పుడూ.. ఎవరితోనూ ఘర్షణలు ప్రారంభించలేదని.. అలా అని ఎవరైనా తమ జోలికి వస్తే మాత్రం ఊరుకోమని అన్నారు. సంబంధం లేని విషయాల్లో టెహ్రాన్‌పై అనవసర ఆరోపణలు చేస్తే.. అమెరికాకు గట్టి ఎదురు దెబ్బ తగులుతుందని హెచ్చరించారు. ఇటీవల అగ్రరాజ్యం హూతీలపై వరుస దాడులు చేస్తోంది. ఈ విషయంపై ట్రంప్ మాట్లాడుతూ.. హూతీలను ఆకతాయి మూకలు, దుండగులుగా పేర్కొన్నారు. వారు చేసే దాడులను భారీ సైన్యంతో దీటుగా ఎదుర్కొంటామని చెప్పారు. అది అక్కడితో ఆగుతుందనే హామీ కూడా ఇవ్వలేనన్నారు. 'బాధితుడి పాత్ర పోషించిన ఇరాన్.. నియంత్రణ కోల్పోయామని చెబుతున్నప్పటికీ అది నిజం కాదన్నారు. హూతీల ప్రతి కదలికలను నిర్దేశిస్తోందని, ఆయుధాలు, నగదు, అత్యాధునికి సైనిక సామగ్రితోపాటు నిఘా సమాచారాన్ని పంచుకుంటోందని ఆరోపించారు. ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, నౌకాదళ నౌకలను ఏ ఉగ్రవాద దళమూ ఆపలేదని అన్నారు.

ఇటీవల యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. రెండురోజుల పాటు కొనసాగిన దాడుల్లో కనీసం 53 మంది మృతి చెందగా.. అనేక మంది గాయపడ్డారు. మరోవైపు హూతీలు మాత్రం తాము తగ్గేదే లేదని, గాజాకు అండగా ఉంటూ, ఎలాంటి సవాళ్లు ఎదురైనా పాలస్తీనియన్లకు సాయం చేస్తామని చెబుతున్నారు

## ట్రంప్ హయాంలోనే ఎక్కువమంది భారతీయుల తిరుగుముఖం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ డిపోర్టేషన్ ప్రక్రియ పాతదే అయినా ట్రంప్ హయాంలోనే ఎక్కువ మంది భారతీయులు వెనక్కి వచ్చినట్లు నివేదికలను బట్టి తెలుస్తోంది. తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 6వేల మంది వెనక్కి రాగా.. బైడెన్ పాలనలో ఈ సంఖ్య 3వేలుగా ఉండటం గమనార్హం. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన భారతీయులను వెనక్కి పంపించే అంశానికి సంబంధించిన డేటాను భారత విదేశాంగ శాఖ ఇటీవల పార్లమెంటుకు అందించింది. దీని ప్రకారం 2009 నుంచి 2024 వరకు 15,564 మంది భారతీయులు వెనక్కి వచ్చారని, చార్టర్డ్ వాణిజ్య విమానాల్లో అమెరికా వీరిని వెనక్కి పంపించినట్లు వెల్లడించింది. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడైన తర్వాత తన పదవీకాలంలో (2017 నుంచి 2021) మొత్తం 6135 మంది భారతీయులను వెనక్కి పంపించారు. 2017లో 1024, 2018లో 1180, 2019లో గరిష్ఠంగా 2042, 2020లో 1889 మంది స్వదేశానికి వచ్చారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. ఇప్పటికే 388 మందిని వెనక్కి పంపిచారు. మరో 295 మంది బహిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జో బైడెన్ పదవీకాలంలో (2021-2025) భారతీయుల బహిష్కరణ సంఖ్య సగానికి తగ్గినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల కాలంలో 3652 మందిని వెనక్కి పంపించగా.. 2024లోనే గరిష్ఠంగా 1368 మంది తిరిగివచ్చారు. ఇదిలాఉంటే, అక్రమ వలసదారులను పంపించే విషయంలో అమెరికా అమానుషంగా వ్యవహరిస్తోందన్న విపక్షాల వాదనకు స్పందించిన ప్రభుత్వం.. ఈ విషయాన్ని ట్రంప్ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినట్లు ఇప్పటికే పేర్కొంది. మరోవైపు ఇదే అంశంపై అమెరికా స్పందిస్తూ.. మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని తెలిపింది.

## లండన్‌లో జోరుగా మొబైల్ దొంగతనాలు

### దిగజారుతున్న మహానగర ప్రతిష్ట - అప్రమత్తమయిన పాలకులు



ప్రపంచంలో అత్యధికంగా సందర్శించే నగరాల్లో ఒకటైన లండన్ కొన్నేళ్లుగా ఓ సవాలు ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ సందర్శకులు, వ్యాపారవేత్తల పర్యటనలు, షాపింగ్ లతో బిజీబిజీగా ఉండే ఈ నగర వీధుల్లో మొబైల్ దొంగతనాలు ఇటీవల ఎక్కువయ్యాయి. సామాన్యులు మొదలు ప్రముఖుల వరకు బాధితులుగా మారుతున్నారు. ప్రతి నెలా వేలాది ఫోన్లు చోరీకి గురవుతుండటం గమనార్హం. వీటిని కట్టడి చేసేందుకు అధికారులు ఇటీవల ప్రత్యేక డ్రైవ్‌లు మొదలెట్టారు. బ్రిటన్‌లో కొన్నేళ్లుగా మొబైల్ ఫోన్ చోరీ కేసులు పెరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. గతేడాదిలో దాదాపు 83వేల ఫోన్లు చోరీకి గురైనట్లు అంచనా. అంటే నిత్యం సగటున 225 ఫోన్లు చోరీ అవుతున్నట్టు లెక్క. రాజధాని లండన్‌లో ఈ సమస్య విపరీతంగా ఉంది. మొత్తం మొబైల్ చోరీల్లో 40శాతం వెస్ట్‌ఇండ్, వెస్ట్‌మినిస్టర్ ప్రాంతాల్లోనే జరుగుతున్నట్లు పోలీసు నివేదికలు వెల్లడించాయి. రద్దీ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ-బైకులు లేదా మోపెడ్ల సాయంతో కొన్ని ముఠాలు ఈ చోరీలకు పాల్పడుతూ, వేగంగా తప్పించుకుంటున్నాయి. ఇటీవల పోలీసులకు పట్టుబడిన ఓ నిందితుడు ఓ రోజు ఉదయం ఏకంగా 12 సెల్‌ఫోన్‌లు చోరీ చేయడం గమనార్హం. క్రిమినల్ గ్యాంగులు వీటితో ఏటా సుమారు రూ.450కోట్ల వ్యాపారం చేస్తున్నాయని అంచనా. సెల్‌ఫోన్ చోరీ ముఠాల ఆడగాలతో లండన్ వీధుల్లో నడవాలంటేనే వణికిపోయే పరిస్థితి తలెత్తిందనే వాదన ఉంది. మొబైల్ ఫోన్ చోరీలు విపరీతంగా పెరగడంతో లండన్ ప్రతిష్ఠ దెబ్బతింటోదని గ్రహించిన అధికారులు, వీటిని అరికట్టే చర్యలు మొదలుపెట్టారు. సీరియస్‌గా తీసుకున్న మెట్రోపాలిటన్ పోలీసులు నగరంలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నారు. ఇటీవల ఓ వారం రోజుల వ్యవధిలోనే 230 మందిని అరెస్టు చేసి వెయ్యిసెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. రద్దీ ప్రదేశాల్లో సివిల్ డ్రెస్‌లో ఉంటూ నిఘా పెట్టడమే కాకుండా ఫోన్లను ట్రాక్ చేసేందుకు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఓ సదస్సులో ఆ దేశ హోంమంత్రి మాట్లాడుతూ మొబైల్ సెక్యూరిటీ ఫీచర్లను మరింత మెరుగుపరచాలని యాపిల్, గూగుల్, శాంసంగ్ వంటి సంస్థలకు సూచించామన్నారు.

## గాజాలో మరింత భూభాగం ఆక్రమించండి

### వత్తిడి పెంచాలని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఆదేశాలు



గాజాలోని మరింత భూభాగాన్ని ఆక్రమించాలని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)ను దేశ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఆదేశించారు. మరింత మంది బందీలను విడుదల చేసేందుకు హమాస్ నిరాకరించడం వల్లనే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. గాజా స్ట్రిప్‌లోని మరిన్ని ప్రదేశాలను ఆక్రమించాలని కాట్జ్ సైనిక దళాలను ఆదేశించారు. దీనితో పాలస్తీనా పౌరులు ఉన్న ప్రదేశాలను ఖాళీ చేయాలని ఐడీఎఫ్ బలగాలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. "ఐడీఎఫ్ బలగాలు, ఇజ్రాయెల్ ప్రజలను రక్షించేందుకు గాజాలో సెక్యూరిటీ జోన్లను విస్తరిం చండి. బందీలను విడుదల చేసేందుకు హమాస్ జాప్యం చేసేకొద్దీ, మరింత భూమిని కోల్పోతుంటుంది. దానిని ఇజ్రాయెల్‌లో విలీనం చేసుకొంటుంది" అని కాట్జ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 85 మంది పాలస్తీనియన్లు మృతి చెందగా, 133 మంది గాయపడ్డారు.

**ఒత్తిడి పెంచాల్సిందే!**

గాజాలో సైనిక చర్య కొనసాగించేందుకు కాట్జ్? ఆమోదముద్ర వేశారు. బందీలు విడుదలయ్యే వరకూ గాజాపై సైన్యం ఒత్తిడి పెంచాలన్నారు. ఇక అక్కడి ప్రధాన ప్రదేశాల్లో నాలుగు దళాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఐడీఎఫ్ ప్రకటించింది. కాల్పుల విరమణ తర్వాత తొలిసారి బుధవారం ట్యాంకులు, పదాతి దళాలు ఆక్రమణకు దిగాయి. నెట్జారిమ్ కారిడార్‌లో ఈ సైనిక చర్య జరిగింది. రెండు వైపుల నుంచి ఉత్తర, దక్షిణ గాజాలను వేరు చేసేలా ఈ ఆపరేషన్ జరిగింది. గాజాలోని తుర్కిష్ ఆసుపత్రిని ఐడీఎఫ్ దళాలు పేల్చేశాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. గతంలో ఐడీఎఫ్ గాజాలో ప్రవేశించినప్పుడు తుర్కిష్-పాలస్తీనియన్ వైద్యశాలనే తమ ఆపరేషనల్ బేస్‌గా మార్చుకొన్నాయి. దీని కింద హమాస్ సొరంగాల నెట్‌వర్క్ ఉన్నట్లు గతేడాది ఐడీఎఫ్ ప్రకటించింది.

**గాజాలో తీవ్ర ఇంధన కొరత!**

గాజాలో తీవ్ర స్థాయిలో ఇంధన కొరత నెలకొన్నట్లు తెలుస్తోంది. ఫలితంగా రెడ్‌క్రెసెంట్ ఎమర్జెన్సీ వాహనాల్లో సగానికి పైగా నిరుపయోగంగా మారాయి. ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ ధ్రువీకరించింది. ఇక్కడ మొత్తం 53 వాహనాలు ఉండగా, 23 మాత్రమే సాయానికి సంబంధించిన సరఫరాలు చేస్తున్నాయి.

డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో

## ముగ్గురు భారతీయులకు మరణశిక్ష?

### ఇండోనేసియాలో కొనసాగుతున్న దర్యాప్తు



డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో ఇండోనేసియాలో ముగ్గురు భారతీయులకు మరణశిక్ష విధించే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 2024 జులైలో సింగపూర్ జెండా ఉన్న ఓడలో మాదకద్రవ్యాలను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సోదాలు నిర్వహించి 106 కేజీల మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నట్లు ఇండోనేసియా పోలీసులు పేర్కొన్నారు. వీటిని అక్రమంగా తరలిస్తున్న భారతీయులు రాజు ముత్తుకుమారన్, సెల్వదురై దినకరన్, గోవిందసామి విమలకందన్‌ను నిర్బంధంలో ఉంచినట్లు తెలిపారు. ఈ కేసులో ఓడ కెప్టెన్ విచారణకు హాజరవ్వాలని ఆదేశించగా.. అతడు గైర్హాజరయినట్లు తెలుస్తోంది. దీంతో త్వరలో ముగ్గురు నిందితులతో పాటు.. ఈ కేసులో విచారణకు హాజరుకాని ఓడ కెప్టెన్కు మరణశిక్ష పడే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఏప్రిల్ 15న తీర్పు వెలువడనున్నట్లు సమాచారం. నిందితులు ముగ్గురు తమిళనాడుకు చెందిన వారుగా తెలుస్తోంది. వీరి తరఫున భారతీయ న్యాయవాది జాన్ పాల్ కేసును వాదిస్తున్నారు. ఈయన కూడా తమిళనాడుకు చెందిన వ్యక్తి కావడం విశేషం. కెప్టెన్‌కు తెలియకుండా ఓడలో ఇంత పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు తరలించడం సాధ్యం కాని విషయమని.. కుట్రపన్ని అమాయకులైన ముగ్గురు వ్యక్తులను ఈ కేసులో ఇరికించారని ఆయన పేర్కొన్నారు. అసలైన నేరస్థులు తప్పించుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరినట్లు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఇదేవిధంగా గతంలో పలుమార్లు డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో ఇండోనేసియా ప్రభుత్వం భారతీయులకు ఉరిశిక్ష వేసిన విషయం తెలిసిందే.

## సూడాన్ అధ్యక్ష భవనం స్వాధీనం



దాదాపు రెండేళ్ల తర్వాత సూడాన్ సైన్యం ఖార్టూమ్‌లోని అధ్యక్ష భవనాన్ని ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ నుంచి తిరిగి స్వాధీనం చేసుకొంది. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. దీనిపై ఆర్‌ఎస్‌ఎఫ్ వర్గాలు ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. దాదాపు రెండేళ్ల క్రితం రాజధాని ఖార్టూమ్‌లో భయంకరమైన అంతర్యుద్ధం మొదలైంది. దీంతో ఆ నగరంలోని చాలా ప్రాంతాలను ఆర్‌ఎస్‌ఎఫ్ అధీనంలోకి తీసుకొంది. తాజాగా ఈ ప్రదేశంపై పట్టు సాధించడం సైన్యానికి అతిపెద్ద విజయమనే చెప్పొచ్చు. ఇటీవల ఆర్మీ మధ్య సూడాన్లోని ప్రాంతాల్లో వరుసగా విజయాలు సాధిస్తోంది. గురువారం రిపబ్లికన్ ప్యాలెస్ వద్ద డ్రోన్లు, యుద్ధ విమానాలు దాడులు చేశాయి. సూడాన్‌లోని పారామిలిటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ దళాన్ని సైన్యంలో విలీనం చేసేందుకు రూపొందించిన ప్రతిపాదన.. రెండు బలగాల మధ్య ఘర్షణలకు దారితీసింది. ఈ విషయమై సైన్యాధినేత అబ్దుల్ ఫతాల్ బుర్హాన్, పారా మిలిటరీ కమాండర్ మహ్మద్ హందాన్ డగ్లో మధ్య కొన్ని వారాలుగా నెలకొన్న విభేదాలు తీవ్రస్థాయికి చేరడంతో అంతర్యుద్ధం మొదలైంది. ఆ తర్వాత అధ్యక్ష భవనం, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి వాటిని ఆర్‌ఎస్‌ఎఫ్ అధీనంలోకి తీసుకొంది. ఇక ఈ యుద్ధాన్ని ఆపేందుకు యత్నించిన ఐరాస సంస్థలను కూడా దేశం వీడేలా చేశారు.

# నేటి నుంచే ఐపీఎల్ 2025

## నాలుగు కొత్త రూల్స్‌ను ప్రవేశపెట్టిన బీసీసీఐ

మిగతా అన్ని టోర్నమెంట్లు ఒకఎత్తు. ఐపీఎల్ ఒక్కటీ ఒక ఎత్తు. ఏడాదికి ఒకసారి జరిగే ఈ టోర్నీ కోసం క్రికెట్ అభిమానులు కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తారు. అన్ని దేశాల ప్లేయర్లు కలపి ఆడే ఈ టోర్నీలో మ్యాచ్ లన్నీ మంచి మజా ఇస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. దాంతో పాటూ ఇది టీ20 టోర్నమెంట్ కావడం వల్ల కూడా అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తారు.

నేటి నుంచే ఐపీఎల్ 2025 అంటే మార్చి 22 నుంచి ప్రారంభం అవనుంది. తొలి మ్యాచ్‌లోనే చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ జట్లు తలపడడంతో ఈ మ్యాచ్‌పై భారీ హైప్ నెలకొంది. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం రెండు జట్లు చెన్నైలో ప్రాక్టీస్ మొదలుపెట్టేసాయి. ఇక ఈ ఐపీఎల్ కోసం బీసీసీఐ కొత్త రూల్స్‌ను ప్రవేశపెట్టింది.



మూడో రూల్ స్టాప్ క్లాక్ రూల్. ఈసారి దీనిని ఆపేసింది బీసీసీఐ. ఓవర్‌కు ఓవర్‌కు మధ్య 60 సెకండ్ల కంటే ఎక్కువ గ్యాప్ ఉండకూడదన్న రూల్ టీ20ల్లో ఉంది, కానీ ఇప్పుడది ఐపీఎల్ కు వర్తించదని చెప్పింది. ఓవర్లకు ఓవర్లకు మధ్య ఎలక్ట్రానిక్ గడియారాన్ని చూపిస్తారు.. నిర్ణీత సమయం లోపు ఓవర్ల కోటా పూర్తి చేసేలా ఇరు జట్ల కెప్టెన్లను ఈ కొత్త నిబంధన అలర్ట్ చేస్తుంది. అంతే కాదు ఫీల్డింగ్ టీమ్ కు ఓవర్ల మధ్య 60 సెకన్ల టైం ఉంటుంది. స్టాప్ క్లాక్‌లో సున్నా వచ్చేంత వరకు మరో బౌలర్ ఓవర్ వేయాల్సిందే.

నాలుగోది స్మార్ట్ రీప్లే సిస్టమ్. ఇదొక కొత్త టెక్నాలజీ. ఎంపైర్లు తీసుకునే నిర్ణయాల్లో మరింత కచ్చితత్వాన్ని, వేగాన్ని పెంచడానికి ఇది ఉపయోగపడనుంది. ఇద్దరు హాక్ ఐ ఆపరేటర్లు టీవీ అంపైర్ ఉన్న ఒకే గదిలో కూర్చుంటారు. స్మార్ట్ రీప్లే సిస్టమ్‌లో భాగంగా ఫీల్డ్ అంతటా ఉన్న హాక్-ఐ ఎనిమిది హై-స్పీడ్ కెమెరాల ద్వారా పొందిన ఫుటేజీని అందిస్తారు.

### కొత్త రూల్స్ ఇవే..

ఇంతకు ముందు ఐపీఎల్స్‌లో లేని విధంగా ఈసారి నాలుగు కొత్త రూల్స్‌ను ప్రవేశపెట్టింది బీసీసీఐ. ఇందులో మొదటిది ఓవర్‌కు రెండు బౌన్సర్లు. ఇప్పటివరకు ఫాస్ట్ బౌలర్లు క్రికెట్‌లో ఒక ఓవర్లో ఒక్క బౌన్సర్ మాత్రమే వేసే రూల్ ఉంది. కానీ ఇప్పుడు దాన్ని మారుస్తూ ఒక ఓవర్లో ఫాస్ట్ బౌలర్ రెండు బౌన్సర్లు వేయడానికి అనుమతినిచ్చింది.

ఇక రెండో రూల్ స్టంపింగ్ క్యాచ్ చెక్. ఇందులో స్టంపింగ్ కోసం రిఫరల్ అభ్యర్థించబడినప్పుడు క్యాచ్‌ను చెక్ చేసే నియమాన్ని కొనసాగించాలని బీసీసీఐ నిర్ణయించింది. దీని ప్రకారం స్టంపింగ్ నిర్ణయాలను ఖరారు చేసే ముందు క్యాచ్‌ల కోసం చెక్‌లను చేర్చడం వలన ఫీల్డింగ్ నిష్పక్షపాతంగా ఉంటుందని చెబుతోంది.

## అవన్నీ అవాస్తవాలే: పీసీబీ

### - మాకు నష్టం రాలేదు..

### 10 మిలియన్ డాలర్లు ఆర్జించాం




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా టీమిండియా నిలిచిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ ఆతిథ్యంలో ఈ టోర్నీ జరిగింది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు భారీ నష్టాలు వచ్చాయని కథనాలు వచ్చాయి. అయితే, తమకు లాభాలు వచ్చాయని తాజాగా పీసీబీ వెల్లడించింది. దాదాపు 10 మిలియన్ డాలర్ల (పాక్ రూపాయల్లో 280 కోట్లు) ఆదాయం వచ్చిందని తెలిపింది. లాహోర్, కరాచీ, రావల్పిండి స్టేడియాల ఆధునికీకరణ చేసేందుకు పెద్ద మొత్తం ఖర్చు చేయడంతో నష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చిందనేది అవాస్తవమని కొట్టిపడేసింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధికారిక ప్రతినిధి ఆమిర్ మిర్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జావెద్ ముర్తాజా ఖర్చులు, ఆదాయం విషయంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని మీడియాకు వెల్లడించారు.

"టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి అన్ని ఖర్చులను ఐసీసీ భరించింది. టికెట్ల అమ్మకాలు, ఇతరాలతో పీసీబీకి ఆదాయం వచ్చింది. ఆడిట్ తర్వాత ఐసీసీ నుంచి మాకు అదనంగా రూ.92 కోట్లు వస్తాయని భావిస్తున్నాం. మేం అనుకొన్న లక్ష్యాలను ఇప్పటికే అధిగమించాం. ఈ టోర్నీ నిర్వహణ ద్వారా అనుకొన్న దానికంటే భారీగానే ఆదాయం మాకు వచ్చింది. ప్రభుత్వానికి ట్యాక్స్ రూపంలోనే రూ.1.20 కోట్లు చెల్లించాం. ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో పీసీబీ ప్రపంచంలోనే మూడో ధనవంతమైన బోర్డుగా మారనుంది. కేవలం నాలుగు నెలల్లోనే స్టేడియాల రెన్నోవేషన్ చేశాం. ఇదంతా పీసీబీ చీఫ్ మోసిన్ నక్వీ చొరవతోనే సాధ్యమైంది. ప్లేయర్ల జీత భత్యాల్లో కోత విధింపు నిర్ణయాన్ని పీసీబీ ఛైర్మన్ వెనక్కి తీసుకున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ అనంతరం.. పాకిస్థాన్ నుంచి ఏ ప్రతినిధిని ట్రోఫీ అందజేసే పోడియం పైకి ఆహ్వానించకపోవడంపై ఐసీసీని వివరణ అడిగాం. దానికోసం వేచి చూస్తున్నాం. త్వరలోనే ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి ఆర్థికపరమైన అంశాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతాం. ఇక్కడ ప్రతి విషయమూ పారదర్శకంగానే ఉంటుంది" అని వెల్లడించారు.

## టైటిల్ అందించడమే నా లక్ష్యం: సిరాజ్

### - రోహిత్ శర్మకు ఘాటు సమాధానం!!



టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను రీసెంట్‌గా ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం ఎంపిక చేయలేదన్న సంగతి తెలిసిందే. అందుకు గల కారణాన్ని కూడా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. పాత బంతితో సిరాజ్ ఎక్కువ ప్రభావం చూపలేకపోతున్నాడని రోహిత్ అన్నాడు. తాజాగా ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఈ విషయంపై సిరాజ్ కాస్త ఘాటుగానే స్పందించాడు.

అదే నా లక్ష్యం..

"నేను గతంలో పాత బంతితో అత్యధిక వికెట్లు తీశాను. ప్రపంచంలోని టాప్ 10 ఫాస్టెస్ట్ బౌలర్స్‌లో ఒకడిని. నా ఎకానమి రేట్ కూడా లోగా ఉంది. నా గణాంకాలే నా ప్రదర్శన ఎలా ఉందో చెబుతాయి. నేను కొత్త బంతితో, పాత బంతితో.. రెండితోనూ బాగా రాణించాను.

ప్రస్తుతం నాకు దొరికిన సమయంలో ఫిట్‌నెస్‌తో పాటు బౌలింగ్‌పై పూర్తి దృష్టి సారించాను. కొత్త బాల్‌తో పాటు పాత బంతితోనూ ప్రాక్టీసింగ్ చేస్తున్నాను. అలానే నెమ్మది బంతులు, యార్కర్స్‌పై కూడా దృష్టి సారించాను. ఐపీఎల్‌లో బాగా రాణించి, గుజరాత్ టైటాన్స్ కోసం టైటిల్ అందించడమే నా లక్ష్యం." అని సిరాజ్ చెప్పుకొచ్చాడు.

ప్రస్తుతం సిరాజ్ అన్న మాటలు చర్చనీయాంశంగా మారాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో తనను ఎంపిక చేయకపోవడంపై వచ్చిన ఫ్రస్టేషన్‌ను.. అతడు ఐపీఎల్‌లో ఏ విధంగా చూపించి రాణిస్తాడో అని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ఐపీఎల్ 2005 సీజన్ కోసం జరిగిన మెగా వేలంలో సిరాజ్‌ను ఆర్సీబీ విడిచిపెట్టింది. దీంతో గుజరాత్ టైటాన్స్ సిరాజ్‌ను 12.25 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ జట్టులో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన రెండో ఆటగాడు సిరాజే కావడం విశేషం.

## ఐపీఎల్ 2025..

## రెండు మ్యాచ్‌లకు రాహుల్ దూరం



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐపీఎల్ 2025 మొదటి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. అతని భార్య అథియా శెట్టి మొదటి బిడ్డకు జన్మనివ్వనుండటమే దీనికి కారణం. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలిస్సా హిలీ ఓ యూట్యూబ్ ఛానల్ వేదికగా తెలిపారు. 'హ్యారీ బ్రూక్ ఐపీఎల్ ఆడటం లేదు. ఢిల్లీ క్యాపిటల్స్‌లో అతడి స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారో చూడాలి. అలాగే కేఎల్ రాహుల్ కూడా మొదటి రెండు మ్యాచ్లు ఆడలేకపోవచ్చు. అతడు తండ్రి కాబోతుండటమే దీనికి కారణం. జట్టు యువ ఆటగాళ్లతో బలంగానే ఉంది. అయినప్పటికీ కేఎల్ రాహుల్ టీ20 (120)ల్లో చాలా కీలకపాత్ర పోషిస్తాడు. అతని ఆట అద్భుతంగా ఉంటుంది' అని ఆమె అన్నారు. కేఎల్ రాహుల్ ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం రూ.12 కోట్లకు తీసుకుంది. అంతకు ముందు రాహుల్‌ను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వదులుకుంది. గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు సారథిగా వ్యవహరించిన రిషబ్ పంత్‌ను ఢిల్లీ వదులుకుంది. అతణ్ని వేలంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ.27కోట్ల భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ కింగ్స్ మార్చి 24న విశాఖపట్నం వేదికగా పోటీ పడనున్నాయి. కానీ ఈ మ్యాచ్‌కు కేఎల్ రాహుల్ అందుబాటులో ఉండటం అనుమానమే.

### ఉప్పల్‌లో ఐపీఎల్..

## 2700 మందితో భారీ భద్రత

మార్చి 22 నుంచి ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న వేళ రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. మార్చి 23న ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. మొత్తంగా 2700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షించనున్నారు.

మరోవైపు, స్టేడియం ఎంట్రన్స్ వద్ద స్నిపర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టనున్నారు. క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే మహిళల కోసం మహిళా భద్రతా విభాగం బృందాలను ఏర్పాటు చేశారు. అభిమానుల కోసం ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ల్యాప్టాప్, అగ్గిపెట్టెలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్ ఉన్న రోజుల్లో నగరంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు నడవనున్నాయి.

బ్లో అప్



సమంత

# "వీరమల్లు"పై సాలిడ్ అప్డేట్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో తన అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం "హరిహర వీరమల్లు" కూడా ఒకటి. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తుండగా మంచి అంచనాలు ఈ సినిమాపై కూడా ఉన్నాయి.

ఇక ఈ చిత్రం నుంచి ఆల్రెడీ వచ్చిన పాటలు మంచి హిట్ అయ్యాయి.

అలానే మేకర్స్ ఒకో అప్డేట్ ని కూడా ఎప్పటికపుడు అందిస్తుండగా ఇపుడు లేటెస్ట్‌గా మరో సాలిడ్ అప్డేట్ ని అందించారు. దీనితో ఈ చిత్రం డబ్బింగ్ పనులు ఇపుడు స్టార్ట్ చేసేసినట్టుగా మేకర్స్ తెలిపారు. ఫుల్ స్వింగ్‌లో ఈ పనులు జరుగుతున్నాయట. ఇక పవన్ కేవలం ఇంకొన్ని డేట్స్ ఇవ్వాల్సి ఉండగా ఇవి ఇస్తే సినిమా పూర్తయ్యిపోతుందని చెప్పవచ్చు. గత ఎన్నికల సమయంలో మొదలు పెట్టిన సినిమా ఇది మరో ఎన్నికలు కూడా అయ్యాయి కానీ ఇంకా రిలీజ్ కాలేదు. మే 9న రిలీజ్ అని ఫిక్స్ చేశారు. మరి అక్కడైనా వస్తుందో లేదో చూడాలి.

# కళ్యాణ్ కోసం మరోసారి ఎన్టీఆర్?



ప్రస్తుతం మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా పలు భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రాల్లో వార్ 2, తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్ తో సినిమా కూడా ఒకటి. మరి ఈ రెండు సినిమాలపై కూడా భారీ హైప్ నెలకొన్న సంగతి తెలిసిందే. ఇంకోపక్క తన సోదరుడు నందమూరి కళ్యాణ్ రామ్ కూడా పలు సినిమాలు చేస్తూ బిజీగా ఉండగా తాను చేసిన లేటెస్ట్ సినిమానే అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమాతో వస్తున్నారు.

ఇక ఈ సినిమాపై రీసెంట్ టీజర్ తో సాలిడ్ బజ్ నెలకొనగా ఈ చిత్రాన్ని వేసవి రేస్ లోనే మేకర్స్ ఫిక్స్ చేశారు. అయితే కళ్యాణ్ రామ్ కోసం పలు సినిమాల ప్రీ రిలీజ్ కోసం తారక్ వచ్చిన సంగతి తెలిసిందే. మరి ఇలా నెక్స్ట్ ఈ సినిమా ఈవెంట్ కి కూడా అన్న కోసం తారక్ వస్తాడని తెలుస్తుంది. ఈసారి ఈవెంట్ ని హైదరాబాద్ లోనే ప్లాన్ చేస్తుండగా ఇక్కడ ఎన్టీఆర్ ని తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.



# మెగాస్టార్ చిరుకి సజ్జనార్ శుభాకాంక్షలు

ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవికి తెలంగాణ ఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి సజ్జనార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. "మీరు భారతీయ సినిమాను గర్వపడేలా చేశారు. బ్రిటీష్ ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మకమైన "జీవిత సాఫల్య పురస్కారం" అందుకున్న తొలి భారతీయ ప్రముఖుడిగా చరిత్ర సృష్టించారు. సినిమా మరియు మీరు చేసిన సేవలు లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ఇది భారతదేశానికి గర్వకారణమైన క్షణం, ఆయన అసాధారణ వారసత్వానికి నిదర్శనం' అని సోషల్ మీడియాలో సజ్జనార్ పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవిని యూకే పార్లమెంట్లోని హౌస్ ఆఫ్ కామన్స్ లో ఘనంగా సత్కరించిన సంగతి తెలిసిందే. నాలుగున్నర దశాబ్దాలుగా సినీ రంగానికి, సమాజానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డును అందించారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.



# నేడు 'ఓదెల 2' నుంచి బిగ్ అప్డేట్!

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ సీక్వెల్ చిత్రాల్లో 'ఓదెల 2' కూడా ఒకటి. దర్శకుడు సంపత్ నంది తన సొంత బ్యానర్‌పై ప్రొడ్యూస్ చేస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు అశోక్ తేజ డైరెక్ట్ చేస్తున్నాడు. ఇక ఇప్పటికే షూటింగ్ ముగించుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే, ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీగా ఉన్నారు. ఈ అప్డేట్ ఏమిటనేది తెలియాల్సి ఉంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్స్ వెల్లడించబోతున్నట్లు చిత్ర వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక ఈ బిగ్ అప్డేట్‌ను ఈ రోజు ఉదయం 10.35 గంటలకు రివీల్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ సినిమాలో తమన్నా నాగసాధువు పాత్రలో నటిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు పీక్స్‌కు చేరుకున్నాయి. ఇక హెబ్బా పటేల్, వశిష్ట సింహా తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ లుక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.



# 'రాబిన్‌హుడ్' ట్రైలర్ వాయిదా..

హీరో నితిన్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'రాబిన్‌హుడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలను క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు వెంకీ కుడుముల డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్ర ట్రైలర్‌ను మార్చి 21న రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు.

కానీ, కొన్ని కారణాల వల్ల ఇప్పుడు ఈ ట్రైలర్ రిలీజ్ వాయిదా పడింది. ఇదే విషయాన్ని మరో ప్రమోషనల్ వీడియో ద్వారా చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్ర ట్రైలర్‌ను మార్చి 23న జరిగే ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో రిలీజ్ చేస్తామని చిత్ర యూనిట్ తెలిపింది. ఇక ఈ ఈవెంట్‌కు డేవిడ్ వార్నర్ కూడా వస్తుండటంతో అందరి చూపులు ఈ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌పైనే ఉన్నాయి.

ఈ సినిమాలో నితిన్ సరసన అందాల భామ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్, దేవ్‌దత్తా నాగె తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తుండగా మార్చి 28న ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.